సోమవారం
11-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 82
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సందిగ్ధతే జీ20 విజయ సంకేతమా!

ఢిల్లీలో శని, ఆదివారాల్లో జరిగిన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశంలో సంయుక్త ప్రకటన విడుదల చేయడం సాధ్యం అవుతుందా కాదా అన్న అనుమానాలు తలెత్తాయి. కానీ మొత్తం మీద ఏకాభిప్రాయం కుదిరి శనివారం సాయంత్రం ఉమ్మడి ప్రకటన విడుదలైంది. ఈ సమావేశానికి రష్యా అధినేత పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు కాకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే లోటే. సంయుక్త ప్రకటనలో కూడా ఈ లోటు ప్రస్ఫుటంగా కనిపించింది.

3 లో

రిమాండ్



చంద్రబాబుకు 14 రోజులపాటు జ్యుడిషియల్ కస్టడీ

- రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు
- సీఐడీ వాదనలను సమర్థించిన కోర్టు
- తీవ్ర ఉత్కంఠ నడుమ ఏసీబీ కోర్టు జడ్జి తీర్పు
- రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ విధించిన ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు బెయిల్ ఇచ్చేందుకు ఏసీబీ కోర్టు నిరాకరించింది. ఆయనకు 14 రోజులపాటు జ్యుడిషియల్ రిమాండ్ (ఈనెల 22వరకు)కు ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. ఆయన్ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. తొలుత స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఏసీబీ కోర్టు న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేసిన అనంతరం గంటల కొద్దీ ఉత్కంఠ నెలకొంది. అవినీతి ఆరోపణలపై చంద్రబాబు తొలిసారిగా అరెస్ట్ కావడం... తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. నంద్యాలలో చంద్రబాబు అరెస్ట్ అయిన క్షణం నుంచి అడుగడుగునా ఈ కేసులో అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 9వ తేదీ (శనివారం) చంద్రబాబును సీఐడీ సుదీర్ఘంగా విచారించింది. ఆదివారం ఉదయం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు తరలించి... ఆ తర్వాత విజయవాడ ఏసీబీ కోర్టులో చంద్రబాబును సీఐడీ అధికారులు హాజరుపరిచారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో రెండు పక్షాల నుంచి సుదీర్ఘంగా జరిగిన వాదనలు విన్నాక న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు. ఈ తీర్పు ఎలా వస్తుందనే దిశగా ఇరు పక్షాలు పడిగాపులు కాశారు. వారితోపాటు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా టీవీల ముందు అతుక్కుపోయారు. తుదకు సీఐడీ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. చంద్రబాబుకు 14 రోజులపాటు జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది. తీర్పు రిజర్వు చేసిన తర్వాత మూడు గంటల పాటు అన్ని కోణాల్లో అధ్యయనం చేసి, తగిన ఆధారాలను పరిశీలించి న్యాయమూర్తి తుది తీర్పును వెలువరించారు. ఈ సమయంలో కోర్టు హాలులో రెండు పక్షాల నుంచి న్యాయవాదులతో సహా 30 మంది మాత్రమే ఉండేలా ఆదేశించారు.

ఉత్కంఠకు తెర

స్కిల్ కేసు ఆరంభం నుంచి చంద్రబాబుకు బెయిల్ వస్తుందా? లేక జైలుకు వెళ్తారా? అనే విషయమై తెలుగు రాష్ట్రాల ప్రజలు ఉత్కంఠతో ఎదురు చూశారు. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా గట్టిగా వాదించడంతో బెయిల్ వస్తుందని టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆశించారు. అయితే ఆయన కేసు మెరిట్స్‌పై వాదనల్ని వ్యూహాత్మకంగా విన్పించలేదు. కేవలం నోటీసుల వ్యవహారం, సెక్షన్ల విధింపుపైనే సుదీర్ఘంగా వాదించారు. స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబుపై 16 సెక్షన్ల కింద సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ సెక్షన్లలో 17 (ఏ), 409 సెక్షన్లు కీలకంగా మారాయి. అవి రెండూ మినహాయిస్తే మిగిలినవన్నీ

- మిగతా 2 లో

నేడు ఏపీ బంద్‌కు టీడీపీ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబుకు రిమాండ్‌ను విధించడాన్ని నిరసిస్తూ ఈ నెల 11వ తేదీ సోమవారం రాష్ట్ర బంద్‌కు టీడీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ఆదివారం ప్రకటించారు. బంద్‌కు ప్రజలంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ

- మిగతా 2 లో

కోర్టుకెళ్లి ఆ వ్యాఖ్యలేమిటీ?

చంద్రబాబు తీరుపై సజ్జల ఆగ్రహం

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబేనని, ఆయనను అరెస్టు చేస్తే ప్రపంచంలో ఏదో జరిగినట్లు టీడీపీ నేతలు హంగామా చేశారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. కోర్టులో రాజకీయ కక్ష సాధిస్తుందంటూ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్ని సజ్జల తప్పుపట్టారు.

2 లో

ఇది ఊహించినదే...

చంద్రబాబుకు బెయిల్ తిరస్కృతిపై నారాయణ

విశాలాంధ్ర-ఖమ్మం: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు బెయిల్ తిరస్కరించడం ఊహించినదేనని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఈ వ్యవహారంలో వైసీపీ, కేంద్ర హోంమంత్రి రాజకీయ ఆట ఆడుతున్నట్లు విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు సీఎం జగన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం రివర్స్ టెండరింగ్, రివెంజ్ (కక్షసాధింపు) పాలన విధానాన్ని అనుసరిస్తున్నట్లు నారాయణ విమర్శించారు.

రాష్ట్ర ప్రజలు మేల్కోవాల్సిన సమయం

మంగళగిరి: టీడీపీ అధినేత చంద్రబాబుకు తన మద్దతు కొనసాగుతుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'విశాఖపట్నంలో గొడవ జరిగినప్పుడు చంద్రబాబు వచ్చి మాకు మద్దతు తెలిపారు. మన కోసం ఓ వ్యక్తి నిలబడినప్పుడు... తిరిగి ఆ వ్యక్తి కోసం నిలబడటం సంస్కారం. అందుకే చంద్రబాబుకు మద్దతు ఉంటుందని చెప్పాను' అని పవన్ వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయాలను మరోస్థాయికి తీసుకెళ్లిందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని పవన్ ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు మేల్కొనాల్సిన సమయం

- మిగతా 2 లో

మోదీకి ఇండియా ఫోబియా

దేశంలో ప్రతిపక్షకూటమి ఇండియా ఏర్పడిన తరువాత ప్రధాని మోదీకి ఇండియా ఫోబియా పట్టుకున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇన్ని రోజులుగా లేని మహిళా బిల్లు ఇప్పుడే గుర్తుకొచ్చిందని, అజెండా లేకుండా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఇది గతంలో ఎన్నడూ జరగలేదని నారాయణ తెలిపారు.

2 లో

క్షణం... క్షణం... ఉత్కంఠ

- వాడీవేడిగా ముగిసిన వాదనలు
- 8 గంటలపాటు...
- 409 సెక్షన్ నమోదుపై అభ్యంతరం
- న్యాయవాదులతో కిక్కిరిసిన ప్రాంగణం

క్షణం... క్షణం ఉత్కంఠ... పోటాపోటీగా వాదనలు... మధ్య మధ్యలో విరామాలు... వెరసి స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు విచారణ ముగిసింది. విజయవాడ ఏసీబీ కోర్టు హాలులో దాదాపు ఎనిమిది గంటలపాటు సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయిన చంద్రబాబును వైద్య పరీక్షల అనంతరం ఆదివారం ఉదయం 6 గంటలకు కోర్టులో సీఐడీ అధికారులు ప్రవేశపెట్టారు.

8 లో

సీఐడీ కాదు... జేపీఎస్

- మార్చేసిన జగన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: సాక్షాత్తు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, జడ్ ప్లస్ భద్రత కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే రాష్ట్ర విచారణ సంస్థగా ఉండాల్సిన సీఐడీ పోలీసు విభాగం పూర్తిగా జగన్ ప్రైవేట్ సైన్యం (జేపీఎస్)గా మారిందా? అనే అనుమానం కలుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. ఆదివారం ఉదయం ఆయన తిరుపతిలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎ.రామా నాయుడు తదితరులతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న నియంత పాలనా పోకడలు, ప్రజాకంటక విధానాలపై మరింత ఉధృతంగా పోరాటాలు చేసేందుకు సమాయత్తం అవుతున్నామని తెలిపారు. నియంత పోకడలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ నేతల అరెస్టుల విషయాలు నిదర్శనాలు అన్నారు. అదే కడప జిల్లాలో ఎంపీ, జగన్ తమ్ముడైన అవినాశ్ రెడ్డిని అరెస్టు చేసేందుకు వచ్చిన కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి రాష్ట్ర పోలీసు యంత్రాంగం సహకరించకుండా, శాంతి,భద్రతల సాకుతో డ్రామాలు ఆడిన తీరును ప్రజలు మరువలేదన్నారు. అదే కర్నూలు జిల్లాలో ఒక మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర సంస్థల భద్రత కలిగిన చంద్రబాబు నాయుడు విషయంలో రాష్ట్ర పోలీసు విభాగాలు వ్యవహరించిన పక్షపాత ధోరణితో రాష్ట్రంలో రాజ్యాంగం ఉందా? అని అనుమానం కలుగుతోందని రామకృష్ణ అన్నారు. ప్రజలు పొరపాటున అధికారం ఇస్తే అడుగడుగునా దుర్వినియోగ పద్ధతులు అనుసరిసూ, ప్రశ్నించే పార్టీల గొంతుకలను అణగదొక్కుతారా అని నిలదీశారు. పాలనలోని తప్పులను ఎత్తి చూపితే మీడియా, పారిశ్రామిక వేత్తలు, పార్టీల నేతలను బెదిరింపులకు గురి చేయడం జగన్‌కి తగదని హితవు పలికారు. లోకేశ్ పాదయాత్ర చేస్తే రాక్షసంగా అడ్డుకునే కుట్రలు చేస్తున్న జగన్ కూడా 2019కి ముందు ఇలాగే చేసి ఉంటే పాదయాత్ర చేసి ఉండే వారా అని ప్రశ్నించారు. పోలీసు అధికారులు, సిబ్బందిలో కొందరి వింత విధానాలు చూస్తుంటే రక్షణ విభాగాల పరువు తీస్తున్నారని చెప్పారు. జగన్ నిజమైన నాయకుడే అయి ఉంటే విదేశాలకువెళ్లి ఇలా కక్షసాధింపు చర్యలకు ఉసిగొల్పరన్నారు. చంద్రబాబును కలిసి సంఘీభావం చెప్పేందుకు వస్తున్న మరో విపక్ష నేత అయిన పవన్ కల్యాణ్ ను పోలీసులు పైశాచికంగా అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. ఎన్నో కేసుల్లో నిందితునిగా ఉన్న జగన్‌కి మిగిలిన అందరూ కూడా నిందితులుగా మారాలన్న పిచ్చి తప్ప మరొకటి కాదని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నాయకులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదీ లోకం!

ప్రజా సమస్యలా? ఇప్పుడు పట్టించుకోవడం కష్టమయ్యా, అందరం కక్షసాధింపు చర్యల్లో బిజీగా వున్నాము!

బ్రెజిల్‌కు జీ20 అధ్యక్ష బాధ్యతలు

- అప్పగించిన భారత్
- నవంబరులో వర్చువల్ భేటీకి మోదీ ప్రతిపాదన
- సంతృప్తికరంగా ముగిసిన శిఖరాగ్ర సదస్సు

న్యూఢిల్లీ: భారత్ అధ్యక్షతన జీ20 శిఖరాగ్ర సమావేశాలు ముగిశాయి. జీ20 కూటమిని విస్తరించి ఆఫ్రికన్ యూనియన్‌ను చేర్చుకోవడం, ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో భారత్ అధ్యక్షత విజయవంతంగా ముగిసింది. అధికారికంగా జీ20 అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్‌కు అప్పగించే ప్రక్రియ కూడా పూర్తయింది. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాకు భారత ప్రధాని మోదీ సంప్రదాయం ప్రకారం గావెల్ (న్యాయదండాన్ని) అందజేయడం ద్వారా బాధ్యతలు అప్పగించారు. తదుపరి అధ్యక్షత వహించబోతున్నందుకు బ్రెజిల్ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మోదీకి మొక్కలను మోదీకి లూలా డ సిల్వాతో పాటు ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో

- మిగతా 2 లో

శ్మశానంలా మారిన మొరాకో

- 2వేలు దాటిన భూకంప మృతులు
- 1,404 మంది పరిస్థితి విషమం
- మూడు రోజుల సంతాప దినాలు

రబాత్: మొరాకో శ్మశానాన్ని తలపిస్తోంది. ఎటుచూసినా శవాల గుట్టలు కనిపిస్తున్నాయి. శిథిలాల నుంచి వందల శవాలను వెలికి తీస్తుండటంతో ఆ ప్రాంతంలో మృత్యుఘోష వినిపిస్తూ భయానక వాతావరణం నెలకొంది. భూకంప మృతుల సంఖ్య 2,012కు పెరిగింది. గాయపడిన వారి సంఖ్య 2,059గా ఉండగా వీరిలో 1,404 మంది ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని మొరాకో అంతర్గత మంత్రిత్వశాఖ తెలిపింది. శుక్రవారం అర్ధరాత్రి మొరాకోను వణికించిన భూకంపం కారణంగా అట్లాస్ పర్వతాల నుండి చారిత్రాత్మక నగరం మారాకేష్ వరకు అనేక నగరాల్లో, గ్రామాల్లో భారీగా ఆస్తి, ప్రాణనష్టం సంభవించింది. నిద్రలోనే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. భవనాలు కూలిపోయాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల నుంచి మృతదేహాలు మాత్రమే బయటకు వస్తున్నాయని సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది తెలిపారు. గాయపడిన వారిని తరలించేందుకు అంబులెన్స్‌లు వెళ్లలేని విధంగా రోడ్లపై రాళ్లు అడ్డంగా పడిపోయి ఉన్నందున వాటిని తొలగించి దారి ఇస్తున్నట్లు వెల్లడించారు. మొరాకో రాజు మహమ్మద్ 6 అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగిన అనంతరం జాతీయ పతాకాన్ని అవనతం చేసి మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించారు. చుట్టుపక్కల పర్వత ప్రాంతాలకు వెళ్లే రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. కొండచరియలు విరిగి పడి దారి లేకపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగినట్లు అధికారులు వెల్లడించారు. తీరప్రాంతాల్లోని రబాత్, కాసాబ్లాంకా, ఎస్సోయిరా ఎక్కువగా ప్రభావితయ్యాయి. మొరాకో చరిత్రలో ఇంతటి భయంకరమైన భూకంపం సంభవించలేదని స్థానికులు అన్నారు. పొరుగున ఉన్న అల్జీరియాలో భూ ప్రకంపనలు వచ్చాయి.

తునీషియా సాయం

ఆపద్కాలంలో మొరాకోకు తునీషియా అండగా నిలిచింది. సహాయక బృందాలను అక్కడకు పంపింది. ఫీల్డ్ హాస్పిటల్ ఏర్పాటు చేసింది. 50 మంది నిపుణులైన రెస్క్యూ సిబ్బంది, మెడికల్ వర్కర్లతో కూడిన బృందాలను మొరాకోకు పంపింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు థర్మల్ మానిటరింగ్ పరికరాలు, డ్రోన్లను అందజేసింది. ఎస్ఆర్‌పి ఆపరేషన్స్‌తో పాటు పౌర రక్షణ బృందాలు, అత్యవసర సహాయ సామాగ్రి, మందులను పంపినట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది.

ప్రపంచ నేతల సంతాపం

ఐరాస ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రస్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, టర్కీ దేశాధ్యక్షులు జిన్‌పింగ్, ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఫ్రాంక్ వాల్టర్, వ్లాదిమిర్ పుతిన్, రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్, జపాన్ ప్రధాని కిషిదా, లెబనాన్ ప్రధాని నజీబ్ మికటి తదితరులు మొరాకోలో భూకంపం కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ బాధాకర సమయంలో మొరాకోకు ధైర్యం చెప్పారు. చేతనైనా సాయం చేస్తామని దేశాధినేతలు తమ లేఖలు, సందేశాల్లో పేర్కొన్నారు.

ఘనంగా ఉ.కొరియా వ్యవస్థాపక దినోత్సవం

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. చైనా, రష్యా ప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. పారామిలటరీ దళాలు, సైనిక కవాత్తును మిత్రదేశాల ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ వీక్షించారు. పరేడ్‌లో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులతో పాటు కొన్ని నిషేధిత అస్త్రాలను ప్రదర్శించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కిమ్ 2 సంగ్ స్క్వేర్ వద్ద సందడి కనిపించింది. భారీ సంఖ్యలో ప్రజలు హాజరై పరేడ్‌ను వీక్షించారు. ఉక్కు సంకల్పంతో తమ దేశాన్ని ప్రపంచ శక్తిగా ముందుకు నడిపిస్తున్నందుకు దేశాధినేత కిమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పరేడ్‌లో రష్యా సైనిక ఆట-పాటను కూడా ప్రదర్శించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వేర్వేరుగా కిమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ లేఖలు పంపారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించుకోవాలని పుతిన్ ఆకాంక్షించారు. ఉత్తర కొరియా తమ అణ్వస్త్రాలను ప్రదర్శించడం ఇది మూడోసారి. ఇంతకుముందు జులైలో నిర్వహించిన పరేడ్‌లో అత్యాధునిక ఆయుధాలతో సైనిక పరేడ్ జరిగింది. రష్యా, చైనా ప్రతినిధులతో కిమ్ సమావేశాలు నిర్వహించారు. పరస్పర సహకారంపై చర్చించారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజింగ్, మాస్కోతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ప్యాంగ్యాంగ్ భావించినట్లు మీడియా పేర్కొంది.

కోర్టుకెళ్లి ఆ వ్యాఖ్యలేమిటీ?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబేనని, ఆయనను అరెస్టు చేస్తే ప్రపంచంలో ఏదో జరిగినట్లు టీడీపీ నేతలు హంగామా చేశారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. కోర్టులో రాజకీయ కక్ష సాధిస్తుందంటూ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యల్ని సజ్జల తప్పుపట్టారు. కోర్టులో ఆ వ్యాఖ్యలేమిటని ప్రశ్నించారు. అరెస్టు వ్యవహారంలో చంద్రబాబు, టీడీపీ నేతలు హుందాగా మాట్లాడి ఉండాల్సిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అంతబలమైన ఆధారాలు లభించాక చంద్రబాబు నిజాయితీ పరుడెలా అవుతారని నిలదీశారు. ఈ కుంభకోణం రూపకర్త, నిర్మాత, చివరి లబ్ధిదారుడు చంద్రబాబు అని చెప్పేందుకు బలమైన ఆధారాలుండటంతోనే ఆయనను సీఐడీ అరెస్టు చేసిందన్నారు. స్కిల్ కుంభకోణం కేసు తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడుతూ అరెస్ట్ సమయంలో చంద్రబాబు అండ్ కో డ్రామాలాడారు. ఏడాదిన్నర క్రితమే ఈ కేసు మొదలైంది. తీగ లాగితే డొంక కదిలింది. ఈ కేసుతో సిగ్గుతో తలదించుకోకుండా లోకేశ్‌తో పాటు చంద్రబాబుకు దత్తపుత్రుడు కూడా శాంతి భద్రతల విఘాతం కలిగించేలా వ్యవహరించారని మండిపడ్డారు. టీడీపీ నేతలు, చంద్రబాబు కుటుంబ సభ్యులు సైతం ఈ కేసుపై నానా హడావుడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఒక స్కీమ్ సృష్టించి, కంపెనీ పేరు దొంగలించి, దానికి బయట వ్యక్తులకు బాధ్యతల్ని అప్పగించి ప్రభుత్వ ఉత్తర్వులతో ప్రజా సొమ్మును దుర్వినియోగించారు. చంద్రబాబు అరెస్టు అనంతరం హెలీకాప్టర్‌లో తరలించేందుకు సీఐడీ యత్నించగా, చంద్రబాబు మాత్రం ప్రచారం కోసం కాన్వాయ్‌లో వచ్చారని విమర్శించారు. చంద్రబాబు అరెస్ట్‌ను, సీఐడీ కస్టడీ ఉన్న సమయంలో ఆయన కుమారుడు లోకేశ్, టీడీపీ నేతలు ప్రవర్తించిన తీరు శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఉందన్నారు. ఆయన దత్తపుత్రుడు విజయవాడ వచ్చేందుకు ప్రయత్నించారని, పోలీసులు అనుమతించకపోతే రోడ్డుపై పడుకుని నటన చూపారన్నారు. జవాబుదారీతనం ఉండాలనేదీ సీఎం జగన్ లక్ష్యమని, దానికి పూర్తి విరుద్ధమైన వ్యక్తి చంద్రబాబు అని సజ్జల విమర్శించారు. టీడీపీ హయాంలో అడ్డగోలుగా అవినీతి జరిగిందని, దానికి పరాకాష్ట స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతని ఆయన వ్యాఖ్యానించారు.

రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

బెయిల్‌బుల్ సెక్షన్లుగానే ఉన్నాయి. 409 సెక్షన్ అనేది నేర పూరిత ఒప్పంద ఉల్లంఘన కిందకు వస్తుంది. 409, 17 (ఏ) సెక్షన్ల నమోదును వ్యతిరేకిస్తూ చంద్రబాబు తరపున లూథ్రా గట్టిగా వాదనలు విన్పించారు. చంద్రబాబు కేసులో ఒక్క 409 మినహా మిగిలిన సెక్షన్లు అన్నీ బెయిల్‌కు అనుమతులు ఉన్నవేనని అన్నారు. అదే స్థాయిలో సీఐడీ తరపున ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి గట్టిగా వాదనల్ని విన్పిస్తూ... స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ప్రధాన సూత్రధారుడు, పాత్రధారుడు చంద్రబాబేనని నొక్కిచెప్పారు. ఇందులో భారీ అవినీతి జరిగిందని, కొందరు విదేశాలకు పరారయ్యారని వాదించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రూ.271 కోట్ల కుంభకోణానికి సూత్రధారి చంద్రబాబేనని, ఆయనను కస్టోడియల్ విచారణకు, రిమాండ్‌కు పంపాలని న్యాయమూర్తిని కోరారు. ఇందుకు సంబంధించి కొన్ని పత్రాలను ఆయన కోర్టు ముందుంచారు.

తీర్పు వచ్చేవరకు కోర్టు హాలులోనే చంద్రబాబు

ఆదివారం ఉదయం 6 గంటలకు వాదనలు ప్రారంభమైనప్పటి నుంచి తీర్పు వచ్చేంత వరకు కోర్టు హాలులోనే చంద్రబాబు ఉన్నారు. చంద్రబాబుతోపాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, విజయవాడ ఎంపీలు కేశినేని శ్రీనివాస్, కనక మేడల, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, నారా లోకేశ్ తదితరులు వాదనలను విన్నారు. న్యాయమూర్తి తీర్పును చంద్రబాబు ప్రత్యక్షంగా విన్నారు. అంతకముందు ఉదయం తన వాదనల్ని స్వయంగా విన్పించుకున్నారు. కోర్టు తీర్పుతో చంద్రబాబును భారీ ఎస్కార్ట్ నడుమ రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏసీబీ కోర్టు దగ్గర భారీగా పోలీసులు, పారా మిలటరీ బృందాలు 3 కిలో మీటర్ల మేర మోహరించారు. విజయవాడ సీపీ క్రాంతి రాణా టాటా నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు పరిసర ప్రాంతాల్లోని రహదారుల నుంచి వాహన చోదకులు, పాదచారులు రాకుండా నియంత్రించారు. కోర్టు లోపల ఉన్న వాందరినీ బయటకు పంపారు. కేవలం మీడియా ప్రతినిధులు, న్యాయవాదులకు మాత్రమే కోర్టు పరిసర ప్రాంతాల్లో ఉండేందుకు అనుమతించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ భరితంగా స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు వ్యవహారం కొనసాగింది.

రాజమండ్రికి తరలింపు

విజయవాడ ఏసీబీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చంద్రబాబును రాత్రి 8.30 గంటల సమయంలో విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి రాజమండ్రి జైలుకు రోడ్డు మార్గంలో తరలించారు. కోర్టు నుంచి అభిమానులకు అభివాదం చేస్తూ చంద్రబాబు ముందుకు సాగారు. ఆయనతోపాటు లోకేశ్, పార్టీ నాయకులు కూడా రాజమండ్రికి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాటు చేశారు.

144 సెక్షన్ అమలు

మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని అన్ని జిల్లాల ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించ కూడదని పోలీసులు హుకుం జారీ చేశారు.

మోదీకి ఇండియా ఫోబియా

- దాసోహమంటున్న జగన్, కేసీఆర్
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-ఖమ్మం: దేశంలో ప్రతిపక్షకూటమి ఇండియా ఏర్పడిన తరువాత ప్రధాని మోదీకి ఇండియా ఫోబియా పట్టుకున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇన్ని రోజులుగా లేని మహిళా బిల్లు ఇప్పుడే గుర్తుకొచ్చిందని, అజెండా లేకుండా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఇది గతంలో ఎన్నడూ జరగలేదని నారాయణ తెలిపారు. ఇండియాకూటమి మరింత బలపడకముందే ఎన్నికలకు పోవాలని బీజేపీ ఆలోచిస్తున్నదన్నారు. ఓటమి భయంతోనే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆయన తెలిపారు. తెలుగు ప్రజలను బీజేపీ మోసం చేసిందని రెండు రాష్ట్రాలలో విభజన హామీలను అమలు చేయలేదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ బీజేపీకి లొంగిపోయారని నారాయణ తెలిపారు. కూతురు లిక్కర్ కేసు కోసం కేసీఆర్ లొంగిపోతే, బాబాయి హత్యకేసులు, తమ్ముడి అరెస్టు విషయంలో జగన్ లొంగిపోయారన్నారు. కేసీఆర్ బీజేపిని గద్దెక్కించేందుకు ఎంఐఎంతో కలిసి ప్రయత్నిస్తున్నారని నారాయణ విమర్శించారు.

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు తీరు చూస్తుంటే ఏపీ సీఐడీఐ డెకాయిట్స్‌లా వ్యవహరించిందని నారాయణ తెలిపారు. కేసులుంటే విచారణ చేయవచ్చుకాని శనివారం తెల్లవారుజామునుంచి సీఐడీ అనుసరించించిన తీరు చట్టానికి లోబడిలేదన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, ఒక సమయంలో జాతీయ స్థాయిలో చక్రం తిప్పిన చంద్రబాబును అరెస్టుచేసే పద్ధతి ఇదికాదన్నారు. బాబు సైతం బీజేపి పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తెలియకుండా చంద్రబాబు నాయుడు అరెస్టు జరగదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి జాతీయ స్థాయిలో ఒకే కూటమిలోవున్న కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీచేయాలని సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చాయన్నారు.

జనసేవాదళ్ శిక్షణ ప్రారంభం

ప్రజాస్వామ్య పరిరక్షణకు మతోన్మాద శక్తుల అడ్డగింతలో జనసేవాదళ్ కార్యకర్తలు ముందు వరుసలో నిలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. సామాన్యుల ఆస్తుల పరిరక్షణ, భూపోరాటాలు మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు సీపీఐ అగ్రనాయకులు అమరజీవి చంద్ర రాజేశ్వరరావు జన సేవాదళ్ ఏర్పాటు చేశారని నాలుగు దశాబ్దల కాలంలో దేశవ్యాపితంగా జనసేవాదల్ చారిత్రిక కార్యక్రమాలను నిర్వహించిందని తెలిపారు. ఆదివారంలో ఖమ్మంలో జనసేవాదళ్ జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభసూచికంగా నారాయణ పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జన సేవాదళ్ కార్యకర్తలతో కలిసి పేరెడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, దేశంలో జన సేవాదళ్ కార్యక్రమాలను మరంతగా విస్తరించాల్సిన అవసరం వుందన్నారు. సంఘ్‌పరివార్ శక్తులు ప్రజల మధ్య మత చిచ్చును రేపుతున్నాయని దానిని ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టుపార్టీ, జనసేవాదళ్ కార్యకర్తలకే ఉన్నదన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా 2024లో దిల్లీలో లక్ష మంది జనసేవాదళ్ వాలంటీర్లు కవాత్ చేసే లక్ష్యంగా ఖమ్మంలో శిక్షణ ప్రారంభమైందన్నారు. జాతీయ స్థాయి శిక్షణ ముగిసిన తరువాత, రాష్ట్ర, జిల్లా మండల స్థాయిలలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని నారాయణ తెలిపారు. 10 రోజులపాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమానికి ఆతిథ్యమించిన ఖమ్మం జిల్లా సమితిని నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేశ్, కంట్రోల్ కమిషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య' మూడో కక్ష్య పెంపు



బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చేపట్టిన తొలి సౌర మిషన్ ఆదిత్య ఎల్-1 దిగ్విజయంగా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు రెండు సార్లు ఆదిత్య ఎల్-1 కక్ష్యను పెంచగా ఆదివారం మూడోసారి కక్ష్య పెంపు ప్రక్రియను పూర్తి చేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రోకు చెందిన బెంగళూరులోని టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్వర్క్ (ఐఎస్‌టీఆర్‌ఏసీ) ద్వారా ఆదిత్య ఎల్-1 మూడో కక్ష్య పెంపు ప్రక్రియ తెల్లవారుజాము 2.30 గంటలకు జరిగింది. ఈ ఆపరేషన్ సమయంలో మారిషస్, బెంగళూరులోని ఇస్రో గ్రౌండ్ స్టేషన్లు ఎస్‌డీఎస్‌సీ-షార్, పోర్టుబ్లెయిర్ నుంచి ఉపగ్రహాన్ని ట్రాక్ చేశారు. కొత్త కక్ష్య 296కిమీలు × 71767 కిమీలుగా ఉంది. కాగా, తదుపరి కక్ష్య పెంపు ఈనెల 15వ తేదీన జరుగుతుందని ఇస్రో వెల్లడించింది.

నేడు ఏపీ బంద్‌కు టీడీపీ పిలుపు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు నిరసనకు దిగారు. నంద్యాలలో చంద్రబాబు అరెస్ట్ అనంతరం నుంచి ఎక్కడికక్కడే టీడీపీ నేతలను, ఎమ్మెల్యేలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. చంద్రబాబు అరెస్ట్‌తో అన్ని జిల్లాల్లోనూ పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్న నేపథ్యంలో అన్ని మండలాల్లో పోలీసు పికెటింగ్‌లు నిర్వహించనున్నారు. చంద్రబాబును తరలించే మార్గంలో భారీ బందోబస్తు ఏర్పాటుకు సిద్ధమయ్యారు.

రాష్ట్ర ప్రజలు మేల్కోవాల్సిన సమయం

(మొదటిపేజీ తరువాయి)

ఆసన్నమైందన్నారు. 'రాజకీయాలు ప్రశాంతంగా ఉంటాయని ఎప్పుడూ అనుకోవద్దు. కోనసీమ జిల్లాల్లో వారాహి యాత్రపై దాడి చేసేందుకు 2వేల మంది నేరగాళ్లను దించారు. కోనసీమ జిల్లాల్లో 50 మందిని చంపేయాలని పథకం పన్నారు. వైసీపీ మూకల కుట్ర తెలిసి కేంద్ర పెద్దలు దాన్ని అడ్డుకున్నారు. ప్రశ్నించే వారిపై హత్యకేసులు నమోదు చేస్తున్నారు. తణుకు, భీమవరంలో వారాహియాత్రపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. రాత్రి నన్ను పోలీసులు అడ్డుకున్నారు.. అప్పుడు నేనేం చేయాలి. అందుకే నడి రోడ్డుపై కూర్చున్నా. వైసీపీ నేతలు యుద్ధం కోరుకుంటున్నారు. మద్య నిషేధం అన్నారు.. దానిపై డబ్బు సంపాదిస్తున్నారు' అని పవన్ కల్యాణ్ విమర్శించారు.

ఐరాస భద్రతామండలిని విస్తరించాలి

- అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాలి
- కాలానుగుణ మార్పులతోనే ప్రపంచ సాధికారత: జీ20 వేదికగా మోదీ పిలుపు

న్యూదిల్లీ: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ) విస్తరణకు జీ20 వేదికగా భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సంస్థలలోనూ సంస్కరణలు అవసరమని నొక్కిచెప్పారు. కొత్త వాస్తవికతలకు అద్దంపట్టేలా మార్పులు, చేర్పులు జరగాలని సూచించారు. సభ్యదేశాలు పెరుగుతున్నా ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల సంఖ్య మాత్రం మారడం లేదన్నారు. 51 దేశాలతో ఐక్యరాజ్య సమితి ఏర్పడిన రోజులు, నేటి పరిస్థితులు వేరని చెప్పారు. సభ్యదేశాల సంఖ్య 200కు చేరువైన విషయాన్ని గుర్తుచేస్తూ కాలానుగుణంగా మారకపోతే ప్రాముఖ్యతను కోల్పోతారని హితవు పలికారు. సామాజిక భద్రత, ద్రవ్య-ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలతో పాటు సైబర్ సెక్యూరిటీ, క్రిప్టో కరెన్సీ కొత్తగా తోడయ్యాయని మోదీ చెప్పారు. ఐరాస భద్రతా మండలి సభ్యత్వం పెంచుకోవడం అనివార్యమని సూచించారు. ప్రపంచంలో ఎన్నో మార్పులు జరిగాయి. రవాణా, కమ్యూనికేషన్, ఆరోగ్యం, విద్య వంటి ప్రతి రంగంలో మార్పు వచ్చిందని, ఇటువంటి పరివర్తలకు అద్దంపట్టేలా కొత్త అంతర్జాతీయ వ్యవస్థ ఉండాలని మోదీ సూచించారు. ప్రస్తుతానికి ఐరాస భద్రతా మండలి శాశ్వత సభ్యదేశాలుగా అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా మాత్రమే ఉన్నాయి. తాజాగా 55దేశాల కూటమి ఆఫ్రికన్ యూనియన్ (ఏయూ)కు జీ20 శాశ్వత సభ్యత్వం కల్పించడం ఓ చరిత్రాత్మక నిర్ణయమని మోదీ చెప్పారు. బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల విస్తరణ కూడా జరగాలని, ఈ దిశగా తీసుకునే నిర్ణయాలు సమర్థంగా, వేగంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వర్తమానాన్ని, భవిష్యత్‌ను ఎక్కువగా ప్రభావితం చేసేవి సైబర్ భద్రత, క్రిప్టో కరెన్సీ అని, సామాజిక క్రమానికి, ద్రవ్య-ఆర్థిక సుస్థిరతకు క్రిప్టో కరెన్సీ కీలకంగా మారిందని, దీనిని నియంత్రించేందుకు అంతర్జాతీయ ప్రమాణాల అవసరమని మోదీ నొక్కిచెప్పారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే కొత్త వనరుగా సైబర్ స్పేస్ తయారైందని, దాని భద్రత కోసం అంతర్జాతీయ సహకారం, కార్యాచరణ ప్రణాళిక అత్యవసరమని, దేశ భద్రతా, సుసంపన్నతకూ ఇది ఎంతో ముఖ్యమని సూచించారు. ప్రతి దేశ భద్రత, సున్నితత్వానికి హామీ ఇవ్వగలిగితే వన్ ఫ్యూచర్ (ఒక భవిష్యత్) బలోపేతం కాగలదని ఆకాంక్షించారు. గోబల్ ఫ్యామిలీ సాకారం కావాలంటే గోబల్ విలేజ్ పరిధికి మించి ఆలోచనలు, చర్యలు ఉండాలని సూచన చేశారు. దేశాల ప్రయోజనాలే కాదు మనస్సులు కలిసివుండే భవిష్యత్ కోసం మోదీ పిలుపునిచ్చారు. కొత్త సాంకేతికలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఇందుకు మంచి ఉదాహరణ అని చెప్పారు. 2019లో ఆమోదించిన ఏఐ విధివిధానాల స్థాయిని జీ20 దేశాలు అధిగమించడం అవసరమన్నారు. 'బాధ్యత- మానవీయ కోణంతో ఏఐ పరిపాలన' కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఇందుకోసం భారత్ కొన్ని సూచనలు చేయగలదని మోదీ చెప్పారు. సామాజిక-ఆర్థిక అభివృద్ధి, అంతర్జాతీయ కార్మికశక్తి, పరిశోధనలు, అభివృద్ధి వంటి అన్ని క్షేత్రాల్లో ఏఐ ప్రయోజనాలు అన్ని దేశాలకు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు.

భారత్‌లో అమెరికా స్థావరాలు నెలకొంటాయా?

న్యూదిల్లీ: ఇక్కడ జరుగుతున్న జీ20 దేశాధినేతల సమావేశం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మధ్య శనివారం జరిగిన చర్చల పర్యవా సానంగా వెలువడిన సంయుక్త ప్రకటనను చూస్తే భారత్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఏర్పాటు అవుతాయేమోనన్న అనుమానం కలుగుతోంది. ఈ సంయుక్త ప్రకటనలో "భారత్ అమెరికా నౌకా దళం నియోగించిన యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, ఇతర నౌకల మరమ్మతులో భారత్ కేంద్రంగా ఉంటుంది అన్న మాటలు ఉండడం ఈ అనుమానాలకు తావిస్తోందని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ అన్నారు. భారత్-అమెరికా సంయుక్త ప్రకటనలోని 18వ పేరా చూస్తే ఈ అనుమానం కలుగుతోందని తివారీ తెలిపారు. "రెండు దేశాల మధ్య మాస్టర్ నౌక మరమ్మతు ఒప్పందం కుదిరినందుకు రెండు దేశాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అమెరికా నౌకా దళంతో భారత మెజగాన్ డాక్ తో ఒప్పందం కుదిరింది. అమెరికా యుద్ధ నౌకల మరమ్మతుకు భారత్ కేంద్రంగా ఉంటుంది" అని ఈ ఉమ్మడి ప్రకటనలో ఉన్న విషయాన్ని మనీశ్ తివారి ఎత్తి చూపారు. "మరమ్మతులకు భారత్ కేంద్రంగా ఉంటుదన్న మాటనుబట్టి చూస్తే భారత్‌లో సైనిక స్థావరాలు ఏర్పడతాయన్న అనుమానం కలుగుతోంది" అని తివారీ వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అనేక చోట్ల, ముఖ్యంగా ఆస్ట్రేలియా, జర్మనీ, ఇరాక్, జపాన్, దక్షిణ కొరియాలో అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. ఎన్డీయే, బీజేపీ ఈ అంశం మీద వివరణ ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు.

బ్రెజిల్‌కు జీ20 అధ్యక్ష బాధ్యతలు

(మొదటిపేజీ తరువాయి)

అందజేశారు. గతేడాది జీ20కి ఇండోనేసియా అధ్యక్షత వహించింది. ఈ ఏడాది నవంబరు వరకు భారత్ అధ్యక్షత కొనసాగుతుంది. ఇదే క్రమంలో నవంబరులో వర్చువల్ భేటీని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన అన్ని వివరాలను తమ బృందాలు సంబంధిత దేశాధినేతలకు వివరిస్తాయని మోదీ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు సంబంధించిన అంశాలను చేర్చినందుకు భారత్‌కు బ్రెజిల్ అధ్యక్షుడు లులా డా సిల్వా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మోదీ సమావేశాలను ముగించే క్రమంలో ప్రసంగిస్తూ జీ20 శిఖరాగ్ర సమావేశాల్లో భాగంగా కీలక అంశాలపై జీ20 కూటమి దేశాలు చర్చించాయని తెలిపారు. ఐక్యరాజ్య సమితికి అవసరమైన సంస్కరణల గురించీ మోదీ ప్రస్తావించారు. ఒక భూమి- ఒక కుటుంబం సదస్సులో చాలా విషయాల గురించి మాట్లాడుకున్నాం. 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు'ను సాకారం చేసుకునేందుకు జీ20 సదస్సు వేదికవ్వడం సంతోషంగా, సంతృప్తికరంగా ఉంది. నవంబర్ చివరిలో జీ20 వర్చువల్ సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపాదిస్తున్నా. రెండు రోజుల్లో జరిగిన చర్చలను ఆ సమావేశంలో సమీక్షిద్దాం. సంబంధించిన వివరాలను మా బృందం మీతో పంచుకుంటుంది. మీరందరూ వర్చువల్ సమావేశానికి సమ్మతిస్తారని భావిస్తున్నా. దీంతో జీ20-2023 సదస్సుకు ముగింపు పలుకుతున్నా,' అని మోదీ అన్నారు. చివరగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సంస్కృత శ్లోకాన్ని చదివారు.

ఆ మూడింటిపై దృష్టిపెడతాం: లూలా

జీ20 అధ్యక్ష బాధ్యతలను భారత్ నుంచి స్వీకరించడం ఆనందంగా ఉందని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లూలా డ సిల్వా అన్నారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు మోదీని అభినందించారు. బ్రెజిల్ అధ్యక్షతలో జీ20 కూటమిని సమర్థంగా ముందుకు తీసుకెళతామని, ప్రధానంగా మూడు అంశాలపై దృష్టిని కేంద్రీకరిస్తామని లూలా చెప్పారు. సామాజిక అంశాలైన ఆకలికి వ్యతిరేకంగా పోరాటం, ఇంధన పరివర్తన, సుస్థిర అభివృద్ధిని ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తేవాల్సిన మార్పులను మోదీ ప్రస్తావించడం అభినందనీయమని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఐరాసలో శాశ్వత సభ్యత్వమిస్తే తాత్కాలిక సభ్యదేశాలు కూడా రాజకీయంగా బలోపేతం అవుతాయన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఐఎంఎఫ్ వద్ద మరింత ప్రాతినిధ్యం కోరుకుంటున్నట్లు లులా డా సిల్వా వెల్లడించారు. జీ20లోకి ఆఫ్రికన్ యూనియన్‌ను స్వాగతించారు.

రిమాండ్‌ను గృహ నిర్బంధంగా పరిగణించాలి

చంద్రబాబు తరపున దాఖలైన పిటిషన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడికి ఏసీబీ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన క్రమంలో చంద్రబాబును జైలుకు తరలించకుండా గృహ నిర్బంధంలో ఉంచాలని ఆయన తరపున న్యాయవాదులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు వయస్సు, హోదా దృష్ట్యా గృహ నిర్బంధంలో ఉంచాలని కోరారు. రిమాండ్‌ను హౌస్ అరెస్టుగా పరిగణించాలని న్యాయవాదులు అభ్యర్థించారు. ఒకవేళ రాజమండ్రి జైలుకు తరలిస్తే ఆయనకు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇంటి భోజనం అందేలా, మందులు దగ్గర ఉండేలా చూడాలని కోరారు. ఈ మేరకు రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని జడ్జి ఆదేశించారు.

చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ పిటిషన్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు కోర్టు 14 రోజుల జ్యుడిషి యల్ రిమాండ్ విధించగా... ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగే అవకాశముంది. మరో వైపు.. చంద్రబాబుకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేయనున్నారు.

జగన్ కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-తాడిపత్రి : రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మెజార్టీతో జగన్‌మోహన్ రెడ్డికి అధికారం ఇచ్చారని, దీన్ని కక్షపూరిత రాజకీయాలకు వాడుకోవడం ఎంతవరకు సమంజసమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రంగయ్య, కేశవరెడ్డి అధ్యక్షత ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ పాల్గొన్నారు. తొలుత రామకృష్ణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. మహాసభల సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు టి.రంగయ్య గజమాలతో సత్కరించారు. అనంతరం జీపుపై ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి కక్షపూరిత రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగాన్ని అరికడతామని, నిత్యావసరాల ధరల పెరుగుదలను నియంత్రిస్తామని వాగ్దానాలు చేసిందని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా ధరల పెరుగుదలను అరికట్టకపోగా ఆకాశాన్నంటే విధంగా పెంచేశారని ధ్వజమెత్తారు. కార్పొరేట్‌లను మరింత ధనవంతులను చేస్తున్నారని, కానీ పేదలను ఇంకా పేదరికంలోకి నెట్టివేస్తున్నారని అన్నారు. ప్రజలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేశారని, ఇప్పుడు ఏడు దఫాలు విద్యుత్ చార్జీలు పెంచి దాదాపు 50 వేల కోట్ల రూపాయలు ప్రజలపై విద్యుత్ చార్జీల రూపంలో భారం వేశారని ఆయన విమర్శించారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయం అంతా జగన్‌మోహన్ రెడ్డి సొంత ఖజానాకు వెళుతుందన్నారు. అంతేకాకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో ఉన్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుని, రాష్ట్రాన్ని రక్షించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా చాలా దోహదపడుతుందని అన్నారు. అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర బడ్జెట్‌తో తక్కువ నిధులు కేటాయించి, కొత్త నిబంధనలు తీసుకువచ్చి, ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వకుండా పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కూలీలు రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేయడానికి, ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, పార్టీ సీనియర్ నాయకులు పెద్దవడుగూరు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దయ్య, మల్లికార్జున, రైతు సంఘం జిల్లా నాయకుడు మల్లికార్జున, తిరుపాలు, నారాయణ స్వామి, నాగరాజు, నాగమునెమ్మ, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వెంకటరాముడు, పట్టణ కార్యదర్శి చిరంజీవి, మండల కార్యదర్శి నాగరంగయ్య, రైతు సంఘం నాయకుడు నారాయణరెడ్డి, రజక సంఘం నాయకులు సూరి, శ్రీరాములు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు కక్షపూరితమే

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాజకీయ కక్షలతో ప్రతిపక్ష పార్టీలను ఇబ్బంది పెట్టడమే సీఎం జగన్ పని అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రతిపక్ష నాయకులను జైలులో పెట్టి ఆయన ఆనందపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఆదివారం విశాఖలో అచ్చెన్న మీడియాతో మాట్లాడారు. జగన్ పిచ్చి పరాకాష్ఠకు చేరిందని, చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఇరికించి అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. తెలుగు ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, దేశంలో ఏ ఒక్కరిని అడిగినా ఆయన దార్శనికతను చెబుతారన్నారు. 16 నెలలు జైల్లో జగన్ మోహన్ రెడ్డి ఉన్నందున ఒక్కరోజైనా చంద్రబాబును అలా ఉంచాలని ప్రయత్నం చేస్తున్నారని, పరిపాలనపై అవగాహన ఉన్న కొంతమంది సీనియర్ మంత్రులైనా ఇది సరికాదని మూర్ఖపు ముఖ్యమంత్రికి చెప్పాలని హితవు పలికారు. తప్పుడు కేసులు పెడితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అచ్చెన్నాయుడు అన్నారు.

రద్దయిన గవర్నర్ అపాయింట్‌మెంట్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను అక్రమంగా అరెస్టు చేశారంటున్న టీడీపీ నేతలు... విశాఖ పర్యటనలో ఉన్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. తొలుత శనివారం రాత్రి 8 గంటలకు గవర్నర్‌తో భేటీకి అపాయింట్‌మెంట్ లభించిందని ప్రచారం జరిగినప్పటికీ సాధ్యపడలేదు. అయితే ఆదివారం ఉదయం 9:30 గం.లకు అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు గవర్నర్ కార్యాలయ వర్గాలు టీడీపీ నేతలకు తెలియజేశాయి. దీంతో అచ్చెన్నాయుడు నేతృత్వంలో 9 మంది టీడీపీ ప్రతినిధి బృందం గవర్నర్ ను కలిసేందుకు సిద్ధం కాగా... ఆ సమయానికి గంట ముందు టీడీపీ నేతలకు ఇచ్చిన అపాయింట్‌మెంట్ రద్దు చేస్తున్నట్లు గవర్నర్ కార్యాలయం వెల్లడించింది. దీంతో నిరాశకు గురైన టీడీపీ నేతలు ...గవర్నర్ తమకు అపాయిం ట్‌మెంట్ ఇవ్వలేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అరాచక పాలనపై గవర్నర్ కలగజేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

జీతాలు,పెన్షన్ల చెల్లింపులో ప్రభుత్వం వైఫల్యం

విశాలాంధ్ర-కర్నూలుసిటీ: రాష్ట్రవ్యాప్తంగా 13లక్షల మంది ఉద్యో గులు, ఉపాధ్యాయులు, కార్మికుల జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ల చెల్లింపులో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న విమర్శించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి అధ్యక్షతన జిల్లా ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్,సీనియర్ నాయకులు మహ్మద్ షఫీ, ఈ సుధాకర్ గౌడ్, శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిమ్మన్న మాట్లాడుతూ... ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాధించలేవని చరిత్ర చెబు తోందన్నారు. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పద్ధతి పునరుద్ధరణ, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.పాత పెన్షన్ పునరుద్ధరణ చేయక పోతే ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి 13 లక్షల మంది, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులుసిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాష్ట్రం లో చదువుకున్న నిరుద్యోగుల కోసం తక్షణం మెగా డీఎస్సీ విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న 40 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జీఓ.117 ను రద్దు చేయాలని, తరగతుల విలీనాన్ని విరమించుకోవాలన్నారు.ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయలకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, విద్యాశాఖ లో విలీనం చేయాలన్నారు. ప్రభుత్వం లో విలీనం అయిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, సుధీర్, రాముడు, ముదసిర్ అహ్మద్, పవిత్రన్ పాల్గొన్నారు.

'స్కిల్' కేసులో పస లేదు: ఎంపీ కేశినేని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబుపై పెట్టిన స్కిల్ డెవలప్ మెంట్ కేసులో ఎలాంటి పసలేదని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వ్యాఖ్యానించారు. విజయవాడ ఏసీబీ కోర్టు దగ్గర ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నాడు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో యువతకు ఉపాధి కల్పన కోసం సీమన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారన్నారు. దానిపై సంబంధిత స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షించాల్సి ఉంది. దీనిపై చంద్రబాబు లీగల్ టీమ్ గట్టిగా వాదనలు విన్పించిందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగు తోందని, చంద్రబాబు బయటకు వస్తారని, న్యాయం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇది కచ్చితంగా అన్యాయమైన కేసు అని నొక్కిచెప్పారు. ఈ కేసులో చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

చంద్రబాబే ప్రధాన సూత్రధారి

- మాజీ సీఎంపై 34 అభియోగాలు
- ఏసీబీ కోర్టుకు 28 పేజీలతో సీఐడీ రిమాండ్ రిపోర్ట్
- లోకేశ్ పేరు కూడా చేర్చిన పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో రిమాండ్ రిపోర్ట్‌ను ఆదివారం విజయవాడలోని ఏసీబీ కోర్టు కు సమర్పించిన సీఐడీ... సంచలన విషయాలను వెల్లడించింది. 28 పేజీలతో చంద్రబాబుపై 34 అభియోగాలను నమోదు చేసింది. ఈ కుంభకోణంలో చంద్రబాబే ప్రధాన సూత్రధారుడని స్పష్టం చేసింది. ఇందులో లోకేశ్ పేరు కూడా ప్రస్తావించింది. ఈ కేసులో రూ.550 కోట్ల కుంభ కోణం జరిగిందని, ప్రభుత్వ సొమ్మును షెల్ కంపెనీలకు నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా మళ్లించారని సీఐడీ తెలిపింది. ఈనెల 9వ తేదీ ఉదయం 6 గంటలకు నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేశామని వివరించింది. ఈ రిమాండ్ రిపోర్ట్‌లో నారా లోకేశ్ పేరును సీఐడీ ప్రస్తావిం చింది. కిలారి రాజేశ్ ద్వారా ఆయనకు డబ్బులు అందాయని వివరించింది. స్కిల్ ప్రాజెక్టులో సీమన్స్ కంపెనీ రూ.3281 కోట్లు గ్రాంట్‌గా ఇస్తుందని చంద్రబాబు, అచ్చెన్నాయుడు అసత్యాలు చెప్పారని పేర్కొంది. ఆ ప్రాజెక్టులో లోటుపాట్లు, తప్పిదాలు ఉన్నప్పటికీ చంద్రబాబు, అచ్చెన్నాయుడు కలిసే ఓకే చేశారన్నారు. ఈ కుంభకోణంలో ప్రభుత్వానికి రూ.300 కోట్ల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ నిధుల్లో భారీ మొత్తాన్ని షెల్ కంపెనీలకు తరలించారని స్పష్టం చేసింది. చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ ద్వారా ముడుపులు అదాయని, ఈ కుంభకోణానికి సంబంధించి ఈడీ విచారిస్తోందన్నారు. ఈ కేసులో ఈడీ ఇప్పటికే చాలా మందిని అరెస్టు చేసిందని, విచారణ కీలక దశలోఉందని వివరించింది. కేసులో మనోజ్ వాసుదేవ్‌కు ఈనెల 5వ తేదీన నోటీసులు ఇచ్చామని, వాటికి జవాబు ఇవ్వకుండా విదేశాలకు పరారయ్యారని పేర్కొంది. వాళ్లని చంద్రబాబు రక్షిస్తున్నారంటూ అనుమానం వ్యక్తం చేసింది. చంద్రబాబుపై నేర పూరిత కుట్ర, నిధుల దుర్వినియోగం, మోసం అభియోగాలున్నాయని తెలిపింది. కీలక డాక్యుమెంట్ల మాయం వెనుక చంద్రబాబు హస్తం ఉందని, మరింత లోతుగా విచారణ చేపట్టేందుకు చంద్రబాబును కస్టడీలోకి తీసుకోవాల్సి ఉందని తెలిపింది. అధికారులు ఇచ్చిన వాంగ్మూలాలతో చంద్రబాబే సూత్రధారి అని తేలిందని స్పష్టం చేసింది.

'ఏపీ వర్క్‌ఛార్జ్‌డ్' నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ వర్క్‌ఛార్జ్‌డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. విజయవాడలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా ఏపీఎన్జీవో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కె.జగదీశ్వరరావు, సహాయ అధికారిగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.జానకి, పరిశీలకులుగా కోశాధికారి ఎ.రంగారావు వ్యవహరించారు. 20 పోస్టులకు 20 నామినేషన్లు రావడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కమిటీ వివరాలు: రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.పోతురాజు, అసోసియేషన్ అధ్యక్షులు మురళీ పాణిగ్రహి, కార్యనిర్వాహక అధ్యక్షులు డి.సత్యవతి, ప్రధాన కార్యదర్శి ఎస్.అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్. సుబ్బరాజు, ఎం.దేవదాస్, ఎం.మరియదాస్, కార్యదర్శులు కె.బ్రహ్మ నాయుడు, ఎండీ సాలెహ్, పి.శ్రీనివాసరావు, యు.రామయ్య, సహాయ కార్యదర్శులు సీహెచ్.శ్రీనివాసరావు, సీహెచ్.గోపి, ఎన్.వేణు, ఎం.బాలకుల్లాయప్ప, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ఎండీ ఖలీల్, బి.శ్రీనివాసరావు, బీవీ నాగేశ్వరరావు, కోశాధికారి జే.నాగేశ్వరరావు, సలహాదారు ఎన్.శ్రీనివాసరావు ఉన్నారు.

ఒప్పంద కార్మికుల్ని తక్షణమే క్రమబద్ధీకరించాలి

పోరాట కమిటీ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ శాఖలోని ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీ కరించాలని పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ పొన్నా శివయ్య డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన నిరసనలో శివయ్య మాట్లాడుతూ ఒప్పంద కార్మికుల ఉద్యోగ క్రమ బద్ధీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. ఆగస్టు 14న జరిగిన వేతన సవరణ ఒప్పందంలో ఉద్యోగులకు తీరని నష్టం జరిగిందన్నారు. విద్యుత్ సంస్థల యాజ మాన్యం జరిగిన నష్టాన్ని పునర్ సమీక్షించుకొని మూడు వెయిటేజి ఇంక్రిమెంట్లతో ఫిట్మెంట్ ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, సంస్థ ద్వారానే నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీ జెన్‌కోలో 25 ఏళ్లుగా జేపీఏలుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందని వారికి పీఏల హోదా కల్పిం చాలన్నారు. ఏపీ జెన్‌కోలో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏజెన్సీ అలవెన్స్ ఇవ్వాలని, జేఎల్ఎం గ్రేడ్-2 వారికి ఏపీ ఎస్ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో మీటర్‌రీడర్స్ పీస్‌రేట్ జాబ్‌లో పనిచేస్తున్న వారిని ఉద్యోగులుగా గుర్తించాలని, ఏపీ సీపీడీసీఎల్ జీవోనం.7 రద్దుచేసి 29, 24 జీవో ప్రకారం వేతనలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 23 నుంచి దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాలో పోరాట కమిటీ నేతలు వి.సుబ్బిరెడ్డి, ఎం.బాలకాశి, చంద్రశేఖర్ కట్టా, నాగరాజు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం ఐక్య పోరాటాలు చేయాలి

24న పత్తిపాడు, 27న చిలకలూరిపేటలో రైతు సదస్సులు : కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రజలకు తాగునీరు, సాగునీరు అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని సాగర్ కాల్వలను పొడిగించాలని, ఇందు కోసం రైతులు, రైతు సంఘాల నాయకులు ఐక్యంగా పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో ఆదివారం ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ చిలకలూరిపేట, పర్చూరు, పత్తిపాడు తదితర ప్రాంతాల రైతులను వంచించి, గతంలో పొగాకు కంపెనీల యాజమాన్యాలు సాగర్ కాల్వల పొడిగింపును వ్యతిరేకించాయని, అందువల్ల ఈ ప్రాంతంలో సాగర్ జలాలు రాక రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగునీరు, సాగునీటి కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. గుంటూరు ఛానల్‌ను పొడిగించాలని, పొడిగింపుకు సత్వరమే నిధులు మంజూరు చేయాలని కోరుతూ పత్తిపాడులో ఈ నెల 24వ తేదీ, తుర్లపాడు, చిలకలూరిపేట, యద్దనపూడి మేజర్ తదితర కాల్వలను పొడిగింపు కోరుతూ ఈ నెల 27వ తేదీ చిలకలూరిపేటలో రైతు సంఘం అధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం పల్నాడు, ప్రకాశం జిల్లాల కార్యదర్శులు ఉలవలపూడి రాము, వడ్డే హనుమారెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారావు, ఉపాధ్యక్షుడు అమర లింగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు చంద్ర కొండలరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, ప్రత్తిపాడు ఏరియా కార్యదర్శి ఎం.రమేష్, నాయకులు పేలూరి రామారావు, బొంతా భగత్‌సింగ్‌పాల్గొన్నారు.

నల్లమలలో జంతు వధ!

విశాలాంధ్ర-రుద్రవరం: నంద్యాల జిల్లా చలమ అటవీ రేంజ్ పరిధిలోని పెద్ద కంబలూరు , కోటకొండ, శ్రీరంగాపురం, తదితర గ్రామాల సమీపంలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతం నుంచి ప్రతిరోజు గుర్తు తెలియని వ్యక్తులు అడవిలోకి సైకిళ్ల పై వస్తూ... కలప, వెదురు, బొగ్గు ,వన్యప్రాణుల మాంసాలను సంచులలో వేసుకొని తరలిస్తున్నారు. వీటితో తో పాటు ఇతర అటవీ ఉత్పత్తులను గుట్టుచప్పుడు కాకుండా పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వినికిడి. ఈ ప్రాంతంలో సంబంధిత అటవీ అధికారుల నిఘా పూర్తిగా కొరవడడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇష్టానుసారంగా అడవుల్లోకి ప్రవేశించి నేరాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినచోట నెమలి ఈకలు పడి ఉండటాన్ని చూస్తే వారు నెమళ్లను వేటాడి చంపి వాటి మాంసాన్ని మూటల్లో కట్టుకొని సైకిళ్లపై తరలిస్తున్నారన్న అనుమానం కలుగుతోంది. అటవీ ప్రాంతంలో కొన్నిచోట్ల కట్టెలు పేర్చి మంటలు వేస్తూ కలపను బొగ్గులుగా తయారు చేస్తున్నారు. అడవుల్లో జంతువులను వేటాడి , వాటి మాంసాన్ని పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న కొన్ని ముఠాలు అడవిలో తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులు పట్టణాలలో నివాసం ఉంటూ ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై దృష్టి పెట్టడంలేదని, సరైన నిఘా లేకపోవడంతో ఇలా ఇష్టానుసారంగా కొందరు వ్యక్తులు అడవిలోకి ప్రవేశించి అటవీ సంపదను తరలించుకు పోతున్నారని చెబుతున్నారు.

సందిగ్ధతే జీ20 విజయ సంకేతమా!

ఆర్వీ రామారావ్

ఢిల్లీలో శని, ఆదివారాల్లో జరిగిన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశంలో సంయుక్త ప్రకటన విడుదల చేయడం సాధ్యం అవుతుందా కాదా అన్న అనుమానాలు తలెత్తాయి. కానీ మొత్తం మీద ఏకాభిప్రాయం కుదిరి శనివారం సాయంత్రం ఉమ్మడి ప్రకటన విడుదలైంది. ఈ సమావేశానికి రష్యా అధినేత పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు కాకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే లోటే. సంయుక్త ప్రకటనలో కూడా ఈ లోటు ప్రస్ఫుటంగా కనిపించింది. సమావేశానికి హాజరు కాని రష్యా, చైనా ఒత్తిడికి లొంగి ఈ ప్రకటన జారీ చేయవలసి వచ్చిందని కూడా రుజువైంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇటీవల జోహానెస్ బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశానికి హాజరయ్యారు కానీ దిల్లీ రాలేదు. కిందటి సారి ఇండోనేసియాలోని బాలీలో జరిగిన సమావేశంలోనూ సంయుక్త ప్రకటన విడుదలలో ఇబ్బందులు ఎదురైనాయి. ఈ సారి కూడా రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం క్రీనీడలు సంయుక్త ప్రకటన మీద స్పష్టంగా గోచరించాయి. జీ20 సమావేశం రాజకీయాలు చర్చించే వేదిక కాదని ఆర్థిక, అభివృద్ధి అంశాలకే పరిమితం అని బాలీలో చేతులెత్తి జోడించవలసి వచ్చింది. శనివారం జీ20 సంయుక్త ప్రకటన కుదిరి ఉండొచ్చు. ఉక్రెయిన్ విషయంలో చైనా, రష్యా అభ్యంతరాలను ఏదో ఒక రకంగా అధిగమించి ఉండొచ్చు. ఈ సంయుక్త ప్రకటనలో ఉక్రెయిన్ మీద దాడి చేస్తున్న రష్యాను ఖండించలేదు. కనీసం రష్యా పేరైనా ఎత్తలేదు. పాము చావకుండా, కర్ర విరగకుండా ఉండే భాషలోనే ఈ అంశాన్ని ప్రస్తావించారు. అంటే సందిగ్ధత లేని వైఖరి అనుసరించడంలో జీ20 బృంద సమావేశం సాధించింది ఏమీ లేదు.

విద్యుదుత్పత్తి, ఇంధనం కోసం కాలుష్య కారకం అవుతున్న బొగ్గు వాడకం తగ్గించాలన్న ఆశయం చాలా కాలం నుంచి వ్యక్తం అవుతోంది. కానీ ప్రపంచంలో ఇప్పుడూ కూడా 75 శాతం ఇంధన వనరులు బొగ్గు ద్వారానే సమకూరుతున్నాయి. దీనికి అంతం ఎప్పుడో ఈ సంయుక్త ప్రకటనలో కాల పరిమితి విధించలేదు. బొగ్గు వినియోగంవల్ల కలిగే నష్టాన్ని అర్థం చేసుకున్నామన్న మాట మాత్రం చేర్చారు. బొగ్గు వినియోగం దుష్ప్రభావాన్ని అర్థం చేసుకున్నామని చెప్పి ఆ ముప్పును దూరం చేయడానికి ఏ నిర్ణయమూ తీసుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటి? ఫలితం ఏమిటో! బొగ్గు ఉత్పత్తిదార్ల లాబీ ఎదుట అన్ని దేశాలు లొంగిపోయినట్టు స్పష్టమైంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తరవాత జీ20 సమావేశం జరగడం ఇది రెండవ సారి. అయినా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలిపివేయించడానికి జీ20 నిర్దిష్ట విధానాన్ని ప్రకటించడంలో విఫలమైంది. సంపన్న దేశాలు పేద, వర్ధమాన దేశాలకు అప్పులిస్తాయి. వాటిని తీర్చడానికి బొగ్గు ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. దీనివల్ల ఎవరి ప్రయోజనాలు నెరవేరు తున్నాయో గ్రహించడం పద్మవ్యూహాన్ని ఛేదించడమంత కష్టమైన పనేమీ కాదు. మత స్వేచ్ఛ, మతోన్మాద వ్యతిరేకతకు అనువుగా ఆసియా దేశాలు ఈ సమావేశంలో తీర్మానాలు ప్రతిపాదించాలని చూస్తే యూరప్ దేశాలు తీవ్రంగా అడ్డుకున్నాయి. అంటే విద్వేష విధానాలను కొనసాగిస్తున్న మోదీ ప్రభుత్వం మీద చిన్న మరకైనా పడకుండా యురప్ దేశాలు కాపు కాస్తున్నాయనుకోవాలేమో!

నిజానికి శనివారం నాటి సంయుక్త ప్రకటన మీద అమెరికా ప్రభావం దండిగా కనిపించింది. ఈ 37 పేజీల సంయుక్త ప్రకటనలో మూడు నాలుగు చోట్ల ఉక్రెయిన్ ప్రస్తావన ఉంది కానీ అటు రష్యా వైపు కానీ, ఇటు ఉక్రెయిన్ వైపు కానీ ఉన్నట్టు కని పించకుండా సకల జాగ్రత్తలూ తీసుకున్నారు. అమెరికా, దానికి అండగా నిలిచే పశ్చిమ దేశాలు ఈ సమావేశాలను జీ7 దేశాలకు అనుకూలంగా మలచడానికి అనేక రకాలుగా ప్రయత్నించాయి. సంయుక్త ప్రకటన ఏకగ్రీవమైందని నమ్మించడానికి మోదీ ప్రభు త్వానికి తాబేదార్లుగా వ్యవహరిస్తున్న గోదీ మీడియా చేయని ప్రయత్నం లేదు. రష్యా, చైనా అధినేతలు ఈ సమావేశానికి హాజరు కాకపోయినా ఆ దేశాల ప్రభావం మాత్రం సంయుక్త ప్రకటన మీద ఉంది.

సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడానికి భారత్ బాహాటంగానే అమెరికాకు దాసోహం అనవలసి వచ్చింది. ఉక్రెయిన్ యుద్ధం, మన సరిహద్దులో ఇటీవల కొనసాగిస్తున్న కవ్వింపు చర్యల కారణంగా రష్యా, చైనా దేశాధినేతలు హాజరు కాకపోవ డానికి కారణం అయి ఉండొచ్చు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు స్వాగతం చెప్పిన తీరు, ఆయనతో మోదీ గడిపిన సమయం అమెరికాకు లొంగిపోయిన తీరుకు నిదర్శనం. అమెరికాతో సన్నిహితంగా ఉండాలని చేసిన ప్రయత్నంవల్ల మనకు ఏం ప్రయోజనం కలుగుతుందో పరిశీలించాలి. రాజకీయంగా చూస్తే అమెరికా తరఫున చైనాను భారత్ నిలవరించాలన్నది అమెరికా,

టిప్పణి

పశ్చిమ దేశాల పన్నాగం. ఆర్థికంగా చూస్తే అమెరికాతో భారత్ వాణిజ్య సంబంధాలు రాశిలో భారీగానే కనిపిస్తున్నాయి. ఇందులో ప్రయోజనం అమెరికాకే అన్నది వాస్తవం. అమెరికా నుంచి మనం దిగుమతి చేసుకుంటున్నవే ఎక్కువ. ఎగుమతులు నామ మాత్రంగానే ఉన్నాయి. అంటే రెండు దేశాల మధ్య వాణిజ్యంలో సమతుల్యత లేశమైనా లేదు. కానీ అమెరికా నుంచి జెట్ ఇంజన్లు, డ్రోన్లు, ప్రపంచ వాణిజ్య సంస్థతో విభేదాల పరిష్కారం లాంటి అంశాలపై రెండు దేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మైత్రివల్ల ప్రపంచానికి మేలు కలుగుతుంది అని ప్రధానమంత్రి మోదీ ఎక్స్ (మునుపు ట్విట్టర్) వేదిక మీంచి పేర్కొన్నారు. ఈ మంచి మోదీ దృష్టిలో ఏమైనప్పటికీ ఆచరణలో అది చైనాను నిలవరించడంలో భారత్ అమెరికా, పశ్చిమ దేశాల చేతిలో పావుగా మారడమే. అమెరికా నుంచి లక్షల కోట్ల రూపాయల యుద్ధ సామాగ్రి కొనుగోలు చేయడం అంటే అమెరికా మీద మరింత ఆధారపడడమే. చైనాతో పోరాడడానికి అమెరికాకు ఒక భాగస్వామి కావాలి. శనివారం మోదీ, బైడెన్ మధ్య కుదిరిన అవగాహన ప్రకారం ఈ భాగస్వామిగా భారత్ ఉంటుంది.

అఫ్గానిస్థాన్‌లో రష్యా సేనలు ప్రవేశించినప్పుడు రష్యాతో తలపడడానికి అమెరికాకు ఒక భాగస్వామి కావలసి వచ్చింది. ఆ పాత్ర అప్పుడు పాకిస్తాన్ పోషించింది. రష్యా తరవాత అమెరికా సేనలు కూడా అఫ్గానిస్థాన్ లో ప్రవేశించాయి. అనేక ఏళ్ల పాటు అక్కడే తిష్ఠ వేశాయి. అయినా అమెరికా ప్రచారం చేసినట్టు అక్కడ ప్రజాస్వామ్యం వేళ్లూనుకోనే లేదు. పైగా అఫ్గానిస్థాన్ ఆర్థికంగా కునారిల్లి పోయింది. ఇప్పటికీ ఆ దేశం అన్ని రకాలుగా కుదేలైపోయే ఉంది. కానీ అమెరికా చేతిలో పావుగా ఉపయోగపడ్డందుకు పాకిస్తాన్‌కు కొంత సహాయం అందిన మాట నిజమే. కానీ అది పాకిస్తాన్‌లో పరిస్థితి మెరుగుపడడానికి ఏ మాత్రం ఉపయోగ పడలేదు. అదనంగా పాకిస్తాన్‌లో తీవ్రవాదానికి ఆజ్యం పోసింది. ప్రస్తుతం పాకిస్తాన్ దివాలా తీసిన స్థితిలో మిగిలిపోయింది. తన లక్ష్యం నెరవేరింది కనక అమెరికా ఇప్పుడు పాకిస్తాన్‌తో స్నేహం చేయడం కూడా మానేసింది. ఇప్పుడు చైనాను నిరోధించేందుకు అమెరికాకు ఓ పావు కావాలి. అందుకే భారత్‌ను చైనాకు వ్యతిరేకంగా ఎగదోస్తోంది. అమెరికాతో స్నేహం ఉందని మోదీ సర్కారు మురిసిపోతోంది. కానీ ఒకప్పుడు అమెరికా ఉక్రెయిన్‌తో ఉంది. ఇప్పుడు ఉక్రెయిన్‌ను నట్టడవిలో వదిలేసింది. దానికి తోడు ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో అనుబంధ దేశంగా మారుస్తోంది. యూరప్ సమాజమూ ఉక్రేయిన్ తో ఉండేది. యుద్ధంలో మాత్రం దీనివల్ల ఉక్రేయిన్‌కు ఒనగూడింది ఏమీ లేదు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి వెలుపలి శక్తులే కారణం. యుద్ధం ఏ దేశానికీ మేలు చేయదు. రెండు దేశాలూ నష్టపోతూనే ఉన్నాయి. అమెరికా తమాషా చూస్తోంది.

రష్యా మనకు దీర్ఘ కాలంగా విశ్వసనీయమైన మిత్రదేశంగా ఉంది. చైనాను వ్యతిరేకించడం కోసం భారత్‌ను వినియోగించుకోవాలని క్వాడ్ దేశాలూ ప్రయత్నిస్తున్నాయి. ఈ బృందంలో భారత్ కూడా ఉంది. చైనా మనకు పొరుగుదేశం దేశం కనక మన సమస్య భిన్నమైంది. కానీ క్వాడ్‌లో సభ్యత్వం ఉన్న అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు చైనాతో వైరానికి భారత్ ను ప్రేరేపిస్తున్నాయి. మన దేశంలో పని చేస్తున్న అమెరికా విదేశీ గుత్త సంస్థల లాభాలు గత సంవత్సరం 80 శాతం పెరిగాయి. ఆ లాభం అమెరికాకే వెళ్తుంది. చైనా బూచిని చూపి అమెరికా మన భుజం మీద చేయి వేసి భరోసా కల్పిస్తున్నట్టు నటించి మన జేబులో చెయ్యి పెట్టి బోలెడు డబ్బు లాక్కుంటుంది. అమెరికాతో మైత్రివల్ల ప్రయోజనం పొందిన దేశం ప్రపంచంలో ఒక్కటి కూడా లేదు. ఉంటే గింటే నాలుగు ఆయుధాలు అందుతాయి. అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడదు.

ప్రగతిశీల విమర్శకుడు సొదుం రామ్మోహన్

సాహితి

డా॥ తక్కోలు మాచిరెడ్డి
సెల్: 7569693239

సొదుం జయరామ్, సొదుం గోవిందరెడ్డి , సొదుం రామ్మోహన్ సోదరులు. జయరామ్ కథకుడు. గోవిందరెడ్డి కవి. రామ్మోహన్ విమర్శకుడు, పాత్రికేయుడు. కడప జిల్లా ఉరుటూరువీరి స్వగ్రామం. సొదుం రామ్మోహన్ విశాలాంధ్ర దినపత్రికలో 20 ఏండ్లు, ఉదయంలో 10 సంవత్సరాలు ఉప సంపాదకుడుగా పని చేశాడు. విశాలాంధ్రలో 'సామాన్యుని డైరీ', ఆనంద భైరవి-అసావేరి' అనే శీర్షికలతో కాలమ్స్ నిర్వహించాడు. రామ్మోహన్ రెండు పుస్తకాలు రాశాడు. 'సాహిత్యావలోకనం', 'సాహిత్యంలో శిల్పం'. 1976 లో అచ్చయిన మొదటి పుస్తకంలో 28 వ్యాసాలున్నాయి. 2 వేల ప్రతులు ముద్రించారు. రెండవ పుస్తకం 1999 లో ప్రచురితం అయింది. దీనికి కేతు విశ్వనాథరెడ్డి ముందు మాట రాశారు. ఇందులో 36 వ్యాసాలున్నాయి. 'సాహిత్యావలోకనం' ను రారాకు అంకితమిచ్చాడు రామ్మోహన్ ఈ మాటలతో- "సమాజ అధ్యయనానికి మెదడు, సారస్వత రసగ్రహణకు హృదయం ప్రధానమని మొదటిసారిగా తెలిపిన రాచమల్లు రామచంద్రారెడ్డి అన్నకు అంకితం'. రారా అనుభూతికి పెద్దపీట వేసి విరసం వాళ్ల చేత 'శిల్పవాది' అన్పించుకున్నాడు.

సాహిత్యావలోకనం సంపుటికి ఉపోద్ఘాతం అనకుండా, సొదుం రామ్మోహన్ "క్షమిస్తే రెండు మాటలు" అంటూ వినయంతో ఈ రెండు మాటలు రాశాడు అవి: ఏ వర్గం ప్రజల గూర్చి నాకు బాగా తెలుసు? ఏ వర్గం ప్రజల జీవితాలు ఎలా ఉన్నాయి? ఏ వర్గం కోసం నేను రాయాలి? ఎందుకు రాయాలి? వారి జీవన పరిస్థితులేమిటి? వారినెలా మందలించాలి? వారి జీవితంలోని లొసుగులను వారికెలా తెలియజేయాలి? ఇంతకంటె ఉన్నతమైన, సౌభాగ్యవంతమైన జీవితం వైపుకి వారి దృష్టినెలా మళ్లించాలి? వగైరా ప్రశ్నలను ప్రతి రచయితా తనకు తానే వేసుకుని పరిష్కారాలు తప్పకుండా కనుక్కోవాలి. కార్మికుల జీవితాలను గూర్చి రాయాలనుకున్న రచయిత వారిని గూర్చి ప్రాక్టికల్‌గా, థియెరిటికల్‌గా క్షుణ్ణంగా తెలుసుకోవాలి. పై మేడలో ఈజీ చైర్‌లో కూచుని పూరిపాకల్లోని వ్యక్తుల జీవితాలను ఊహించి రచనలు చేస్తే ఒక విధంగా నేరమే అవుతుంది.

'సాహిత్యావలోకనం' లోని కొన్ని వ్యాసాల్ని ఇపుడు పరిశీలిద్దాం. ఈ సంపుటిలోని 'సాహిత్యం- విప్లవం' లో విప్లవాన్ని నిర్వచిస్తూ రామ్మోహన్ ఉంటాడు. సామాజిక సంబంధాలు సమూలంగా మార్పు చెందడాన్ని విప్లవం అంటారు అని కాని సామాజిక సంబంధాలతో పాటు ఆర్థిక సంబంధాల్లో గుణాత్మకమైన మార్పు రావడం కూడ విప్లవమే. విప్లవం జరగడానికి ముందు విప్లవకర పరిస్థితి ఉండి తీరాలి అంటూ విప్లవకర పరిస్థితి ఉన్నంత మాత్రాన విప్లవం పూడిపడాలన్న రూలెక్కడా లేదు. విప్లవకర సన్నివేశాన్ని మార్క్సిస్టు -లెనినిస్టు అవగాహనతో- ఇలా పేర్కొన్నాడు సొదుం రామ్‌మోహన్. మొదటిది: ఏ మార్పూ లేకుండా, పాత పద్ధతుల్లో పరిపాలించడం అసాధ్యమైపోవాలి. రెండవది: కొల్లగొట్టబడే వారికి కష్టాలు, వేదనలు దుర్భరమై, అసహనీయమై పోవాలి. ఫలితంగా వాళ్లలో తిరుగుబాటు, ధోరణి జ్వలించాలి. మూడవది: పీడిత వర్గం కార్యరంగంలోకి దుమకాలి అంటే, ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, ఆందోళనలు ఫెళఫెళమని విరుచుకుపడాలి. సాహితీ రంగానికి సంబంధించి మరో లక్షణం వేదనలూ, కష్టాలూ దుర్భరమై పీడిత వర్గంలో తిరుగుబాటు తత్వం కలగాలన్నా, సాహిత్యంలో కూడా స్పష్టంగా, తీవ్రంగా, బలంగా ఆ తత్వం చోటు చేసుకోవాలి.

సామాజిక విప్లవం జరగడానికి కారణభూతమైన వివిధ సామాజిక శక్తులు సాహిత్య ఒక్కటన్న పరిమితిని గుర్తించాలి.విప్లవకర పరిస్థితి లేకపోయినా, విప్లవ ఆవశ్యకత గూర్చి రాయడం వల్ల ప్రయోజనమే ఉంటుంది తప్ప, నష్టం ఉండదు. 'సాహిత్యం-ప్రచారం' అనే వ్యాసంలో ప్రగతిశీల దృక్పథం అంటేనే 'అదిగో ప్రచారం' అంటూ దుష్ప్రచారానికి లంకించుకునే శుద్ధ కళావాదులూ, పక్కా అభివృద్ధి నిరోధకులూ ఎప్పుడూ ఉంటారు. ఇలాంటి వారికి ఎప్పటికప్పుడు తగు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అభ్యుదయ రచయితలపై ఉంది,

చార్లీచాప్లిన్ ఆత్మకథ ఆధారంగా అతనిపై ఓ వ్యాసం రాశాడు రామ్మోహన్. చాప్లిన్ ఫ్రాయిడ్ వాదాన్ని ఖండిస్తూ ఒకచోట రాశాడు. "మనిషి ప్రవర్తన మీద సెక్సు కంటే, ఆకలి, దారిద్ర్యాలకే ఎక్కువ ప్రాబల్యం ఉంటుంది." చార్లీచాప్లిన్ తీసిన సినిమాలు పెద్దగా సెన్సార్‌కు గురి అయినాయి. రామ్మోహన్ మాటల్లో "చాప్లిన్ గొప్ప నటుడే కాదు, ఉత్తమ రచయితే కాదు, కరుణ, శాంతి ప్రియత్వం న్యాయకాంక్ష, మానవాళి పట్ల అపారమైన దయ, యుద్ధం పట్ల తీవ్ర నిరసన ఆయన వ్యక్తిత్వపు మూల స్తంభాలు. అడోల్ఫ్ హిట్లర్ చర్యలను ఖండిస్తూ ఆయన తీసిన చిత్రం 'ది గ్రేట్ డిక్టేటర్' ఆ చిత్రం తీస్తే చంపుతామని చాప్లిన్‌కు అనేక ఉత్తరాలొచ్చాయి.

సాహిత్యంలో వర్గ దృక్పథం అనే వ్యాసంలో రామ్మోహన్ అంటాడు: కార్మిక వర్గ పక్షపాతాన్ని ప్రదర్శించేందుకు రచయిత తప్పనిసరిగా శ్రమ జీవులున్న కథనో, నవలనో ఎన్నుకోవాల్సిన పనిలేదు. ఈనాడు మన రచయితలు అత్యధికంగా మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారే కాబట్టి అలాంటి రచయితలు మధ్య తరగతి పాత్రలతో కూడిన కథలూ, నవలలూ రాయొచ్చునని సూచిస్తాడు రామ్మోహన్. 1970 దశాబ్దంలో రాసిన ఈ పంక్తులు విరసం రచయితలు క్రియాశీలముగా ఉంటున్న నేటి సందర్భంలో సముచితమని అన్పించదు. అభ్యుదయ భావాలకేం-అవి చాలా మందికి ఉంటాయి పుష్కలంగా. వాటిని 'కళాత్మకం' గా వ్యక్తీకరించిన వాడే అభ్యుదయ రచయిత అవుతాడన్న విషయాన్ని నిద్రలో కూడా విస్మరించరాదు అని గట్టిగా చెబుతాడు సొదుం రామ్మోహన్.

కేవలం జీవిత వాస్తవాలను చిత్రించడం లేదు. వాటి వెనుక గల శక్తులను అంటే, జీవితంలోని ఘోరాలకు , అనర్థాలకు, సుఖాలకు, దుఃఖాలకు గల కారణాలను విశ్లేషించి సాహిత్య రచన సాగించడం వేరు. ఈ రకం రచనలోనే సామాజిక దృక్పథం ఉంది అంటాం. అని ప్రగతిశీల విమర్శకుడు రామ్మోహన్ రాస్తాడు. తిలక్‌ను రారా భావకవి అన్నాడు. రామ్మోహన్ తిలక్‌ను సామాజిక కవిగా పేర్కొంటాడు. తిలక్ రాసిన 'ఆర్త గీతం' కవితను ఉటంకిస్తూ.

స్త్రీ వాదాన్ని హృదయ పూర్వకంగా స్వాగతిస్తాడు రామ్మోహన్. దాని నేపథ్యం కూడా వివరిస్తాడు. దురహంకారంపై దూసిన కత్తులు అనే శీర్షికన దీన్ని విశదీకరించాడు. ఆయన మాటల్లోనే, "మన రాష్ట్రంలో (అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో) 1993 లో జనవరి నుంచి జూన్‌లోగా అంటే కేవలం ఆరునెలల వ్యవధిలోనే 136 కట్నం చావులతో బాటు 36 కట్నం హత్యలు జరిగాయంటే స్త్రీల పరిస్థితి ఎంత దయనీయంగా, దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. స్త్రీ వాద కవిత్వాన్ని వ్యతిరేకించడంలో ఎస్వీ కంటే జ్వాలాముఖి ఏడాకులు ఎక్కువ చదివినట్లుంది. స్త్రీ వాద కవిత్వాన్ని ఆయన ఏకంగా అంతర్జాతీయ కుట్రగా ప్రచారం చేస్తున్నాడు. శ్రామిక వర్గం విముక్తి సాధించేదాకా స్త్రీ ఇలా అత్యాచారాలకు, కట్నం చావులకూ, ఆత్మహత్యల పేరిట హత్యలకూ నిత్యం గురి కావల్సిందేనా? అని ప్రశ్నిస్తున్నాడు రామ్మోహన్. రా.వి.శాస్త్రి ధోరణి మరీ విడ్డూరంగా ఉంది. ఈయన సోషలిజాన్ని నిజంగా సమర్థిస్తున్నాడంటే, నమ్మశక్యం కాదు. ఆయన ఇలా అన్నాడు-

ఈ గయ్యాళులిల్లా కాకుండా మధుర వాణిలా ఫెమినిస్టులున్నా బాగుండేది. సోకాల్డ్ మధ్య తరగతి స్త్రీలకు వేరే పనీపాటా లేకుండా చేసే అల్లర్లు స్త్రీయా? పురుషుడా? అని ఆలోచించకూడదు. మనిషిగా ఆలోచించమనండి.

ఆధునిక సమాజంలో స్త్రీల చైతన్యం పెరుగుతోంది. వారు తమ వ్యక్తిత్వం కోసం పోరాడుతున్నారు. తమకు మాత్రమే అనుభూతం కాగల అనుభవాల గురించి కవితల్లో కలవరిస్తున్నారు. ఆ కవితల్ని సానుభూతితో అర్థం చేసుకోవాలా? అక్కర్లేదా? స్త్రీ స్వేచ్ఛ కోసం ఆరాటపడుతున్నదీ, పోరాటాలకు ఉద్యుక్తమవుతున్నదీ విద్యాధిక మహిళలే. ఆర్థికమే స్త్రీలకు సర్వ సంపూర్ణ సమానత్వం ప్రసాదిస్తుందని భావించడం పొరపాటు. స్త్రీ సమానత్వం కోసం రెండు రంగాల్లో పోరాటం కొనసాగించాలి అని, ఒకటి శాసన రంగం, రెండు సాంస్కృతిక రంగం. అంటే, చట్టాలు ఎంత అవసరమో,పురుషుని సంస్కారాన్ని మెరుగుపరచడం కూడా అంతే అవసరం. ఈ తరంలోని పురుషుని సంస్కారంలో మార్పు వస్తే, ఆ మార్పు రక్తగతం కావాలంటే కొన్ని తరాలు పట్టవచ్చు అంటాడు రామ్మోహన్.

ఇకపోతే మరో కోణం నుంచి దళితవాదం అనే తన వ్యాసంలో దళిత చైతన్యం పెరిగిందనీ, దీనికి ఒక కారణం ప్రధాని ఇందిరాగాంధీ చేపట్టిన కొన్ని చర్యలు అనీ అభిప్రాయం వ్యక్తం చేస్తాడు రామ్మోహన్. రామ్మోహన్ రాసిన 'సాహిత్యంలో శిల్పం' అనే పుస్తకానికి ముందుమాట రాస్తూ కేతు విశ్వనాథరెడ్డి రామ్మోహన్ విలక్షణమైన వ్యాసకర్త అని అన్నాడు. ఎవదుకంటే, సాహిత్య వ్యాసాలు రాయడం ఇతనికి "నీళ్ల చెర్లాటం" వంటిది అని కూడా అన్నాడు కేతు. వస్తువు, శిల్పం- అనుభూతి సంయోగాన్ని కోరే సాహిత్య హృదయం ఇతనిది అని అన్నాడు కేతు. మరల రారాను గుర్తు చేసుకుందాం. ఆయన మాటల్లోనే- శిల్పం అనేది ఒక సాధనం మాత్రమే. శిల్పం ద్వారా సాధించవలసింది కళ. కళ అంటే అనుభూతి. అనుభూతి సంపదలేని రచన. గొప్ప శిల్ప నైపుణ్యం అనిపించుకోవచ్చు కానీ, కళ అన్పించుకోదు. కథలలోని గొప్పతనం అంతా అదే. ఉన్నత మానవీయ సంవేదనయే. ఇది కథ చదివేటప్పుడే రీడర్ ఫీల్ కావాలి. లేకపోతే తరువాత కోల్డ్ ఇంటలెక్చువల్ ఎనాలసిస్‌కు అందేది కాదు.

రారా శిల్పానికీ, అనుభూతికీ అంత ప్రాముఖ్యం ఇవ్వాల్సి వచ్చింది అని రామ్మోహన్ అభిప్రాయపడతాడు. అంతే తప్ప సాహితీ ప్రయోజనం పట్లగానీ, సాహిత్యంలో వస్తువు ప్రాధాన్యం పట్లగానీ ఆయనకు చిన్నచూపు ఏనాడు లేదు. విరసం వాళ్లు ఆయనను శిల్పవాది అనడం సబబు కాదు. శిల్పాన్ని మింగరాదు అంటాడు రామ్మోహన్. ఆయన మాటల్లో కథలూ, నవలలూ వాస్తవాలు ప్రాతిపదిక పైనే రచించాలి. ఐతే, వాస్తవాలు మాత్రమే కొట్టొచ్చినట్లు కనబడి, రచనలో శిల్పాన్ని మింగరాదు. అందరికీ అర్థమయ్యే ఓ భావ చిత్రం ద్వారా వాస్తవానికీ, సాహిత్యానికీ ఉన్న సంబంధం తెలియజేస్తాడు రామ్మోహన్ అంటాడు- నిజానికి- వాస్తవానికీ, సాహిత్యానికీ ఉన్న సంబంధం నూలుకూ, వస్త్రానికీ ఉన్న సంబంధం లాంటిది. నూలు లేకపోతే వస్త్రం లేదు. వస్త్రంలో మనకు ప్రత్యేకించి నూలు నూలుగా కనబడదు. వస్త్రమే కన్పిస్తుంది. సాహిత్యమూ అంతే అంటాడు- ప్రగతిశీల విమర్శకుడు సొదుం రామ్మోహన్.

అరసం కవితలు-2023

మింగ మెతుకు లేదు

ఎస్.దేవహర్షిణి, సెల్: 7702059335

వికేంద్రీకరణతో రాష్ట్రాన్ని పట్టించాలని అభివృద్ధి బాట
పాలకులు సంకల్పించారు మూడు రాజధానులనే ముచ్చట
దీనితో నిరుద్యోగులకు కలుగును ఉద్యోగ అవకాశాల ఊరట
నూతన నిర్మాణాలతో జన జీవనశైలి ఎన్నో రెట్లు మెరుగవుట

మూడు రాజధానులనే మాట బహుమంచిదే
కానీ బడ్జెట్ అవుతుంది తడిసి మెను భారమే
ఆర్థిక వనరులు చూస్తే అంతంత మాత్రమే
ఈ ద్రవ్యలోటుని అధిగమించుట బహు కష్టమే

ముందుగా అమరావతిని రాజధానిగా అభివృద్ధి గావించి
నవ్యాంధ్రను దివ్యాంధ్రగా మలచి ప్రపంచానికి చాటించి
రాష్ట్రాన్ని ప్రగతి బాటలో కదు రమ్యంగా నడిపించి
నాడు చేపట్టాలి మూడు రాజధానులనే ముచ్చటను ఆలోచించి

ఆశయం మంచిదైనప్పటికీ ఆర్థిక వనరుల లోటు
అర్థరహితంగా చేపడితే అన్నింటా మొదటికే చేటు
బడ్జెట్ లేమితో ఆంధ్రరాష్ట్రంపై పడింది తీవ్రమైన వేటు
అవగాహన రాహిత్యంతో చేపడితే జరుగును పొరపాటు

ప్రస్తుతం ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులకే లేదు ఠికానా
వేతనాలు అందట్లేదని వాపోతున్నారు ఉద్యోగులు స్వయానా
అత్యవసర వైద్యానికై అర్జీ పెట్టినప్పటికీ ఇవ్వట్లేదు బయానా
ఇప్పుడు రాష్ట్ర ప్రజలకెందుకు ఈ మూడు రాజధానుల నజరానా

పరిపాలన అనుభవ లేమితో రాష్ట్రాన్ని కాష్టం చేసి
రాష్ట్ర ప్రజల బాగోగులు చూడక అష్టకష్టాల పాల్జేసి
ఖజానాలో ఉన్నదంతా ఉచిత పథకాలకై సర్వం ఊడ్చేసి
అన్ని రంగాలలోనూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చేసి
రాష్ట్ర ఖజానాను పూర్తిగా దివాలా తీయించి
మింగ మెతుకు లేకున్నా మీసాలకు సంపంగినూనె...అన్న చందంగా
ఇప్పుడు రాష్ట్రానికి మూడు రాజధానుల నిర్మాణమే...శుద్ధ దండగా
ఇక దిక్కెవరు ఆంధ్ర ప్రజలకు అండగా!

హాస్య రసగుళికలు పిలగోడి కథలు

కథలను రాయటం, అందులో హాస్య కథలను రాయటం కొంచెం కష్టం అయినా అటువంటి కథలనే రాయటం కాక ఆ ప్రాంతం మాండలీకాన్ని తీసుకొని దాన్ని పాత్రలతో చెప్పించటం విశేషం. ముఖ్యంగా ఈ పుత్తూరు పిలగోడు పుస్తకంలోని కథలన్ని చిత్తూరు జిల్లా మాండలికంలో సాగుతుంది.ఇందులో కృష్ణా, కిష్టడు, కృష్ణ అనే ఒకే పేరులా సాగే హాస్య రసగుళికలు ఈ పుత్తూరు పిలగోడు. ఇందులో దాదాపు 32 కథలున్నాయి. ప్రతి కథ ఆంధ్రప్రభలో ప్రచురితమైనది. అన్ని కథలను హాస్యంతో పాటు ఆ ప్రాంత మాండలికం, ఆ ప్రాంత పద్ధతి, ఆ ప్రాంత వాడుక భాష మొదలైన వాటిని నేర్పుగా పట్టి కిష్టా పాత్రతో హాస్యం కలిపి పాఠకుల ముందుంచారు రచయిత ఆర్.సి.కృష్ణస్వామిరాజు.



పుత్తూరు పిల'గోడు' (సరదా కతలు)
ఆర్.సి. కృష్ణస్వామిరాజు
పేజీలు: 107, వెల: రూ. 160/-
ప్రతులకు:
ఆర్.సి.కృష్ణస్వామిరాజు, 22-4-71,
బ్యాంకు ఎంప్లాయీస్ కాలనీ
మంగళంరోడ్, తిరుపతి-517507. మరియు
అన్ని ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాల్లో

ఈ కథలలోని సంఘటనలు అన్ని చాలామంది నిజ జీవితంలో జరిగే ఉంటాయి. హైస్కూలు చదివే ఒక కుర్రవాని ఆలోచనలు. అతని ప్రవర్తన మొదలగు వాటిని ప్రతి కథలో కూర్చటం వల్ల ఎప్పుడో మన చిన్నతనంలో ఇటువంటి సంఘటనలు మనకు జరిగినవి గుర్తుకు వస్తాయి. కథలన్నీ హాస్యమే ఓపిక లేకపోయినా, చదవటం మొదలుపెడితే చివర వరకు ఆగవు. ఇందుకు దుశ్శాలువా కప్పంగ కథ నేటికి చాల పల్లెటూర్లలో జరిగే వాస్తవ సంఘటనే కాని దాన్ని ఇలా హాస్యంగ చెప్పటం విశేషం.

అలాగే అమ్మకు ఏమైంది అనే కథలో పెద్ద పెద్ద పేరున్న డాక్టరు వద్దకువెళ్లి వందలు, వేలు తగలేసుకొనే బదులు దగ్గరలోని యం.బి.బి.యస్ లేదా ఆర్.ఎం.పి వద్దకు వెళ్లి జబ్బు సంగతి తేల్చుకోవటం మంచిది అనేది సత్యం . ఇది ఆనాటి కాలం పెద్దవారిలో ఈనాటికి ఉంది అని తెలియజెప్పే నీతి కథ అనొచ్చు. ఇక నల్లంచు తెల్లచీర కథ చివరి వరకు ఉత్కంఠ కల్గిస్తుంది. చివరిలో ఆమె భర్త అమెకు చీర కడతాడు అనే సంగతి తెలియటంతో కథలోని ఉత్కంఠ తగ్గుతుంది. మరో గొప్ప హాస్య కథ ఒక మాటకు ఎన్ని అర్థాలు ఉంటాయో తెలిపే కథ 'కరీంనగర్ కుట్టి'. ఆ కరీంనగర్ కుట్టి కిష్టాని అండా కావాలంటే కిష్టడు ఏ అండా ఇచ్చాడో తెలుసుకోవాలంటే ఈ కథ చదవాల్సిందే. అలాగే బుజ బుజ నెల్లూరు బుల్లికథలో నెల్లూరు నెరజాణ లాంటి అమ్మాయి వచ్చి ఈత నేర్చుకునేందుకు సొరకాయలు అడిగితే... చివరకు ఏమైందో తెలుసుకోవాలంటే ఈ కథను చదవాల్సిందే. ఇలా చెప్పుకుంటూ వెళితే ప్రతి కథలో ఏదో ఒక విశేషం ఉంది. అది తెలుసుకోవాలంటే పుత్తూరు కథలు చదవాల్సిందే.

విష్ణుభొట్ల రామకృష్ణ

కల సంకలనం

నా లోపలికెళ్లి
అలంకార అహంభావాలను ఒలిచి పక్కన పెట్టి
తలుపేసుకుని మూల మూలలో పోగొట్టుకున్న
గుట్టల కొద్ది జ్ఞాపకాలల్లో
స్పృహ కోల్పోయిన కల సంకలనాలు
తెరిచేకొద్దీ నోటికి తగిలే పగిలిన పదాలపై
నా కంటి పాపలే నా కళ్ళను,
విరిగిన వాక్యాలపై
నా కాలి ముద్రలే నా నడకను తప్పుపట్టి
ముఖంలోకి దూకిన అపరిచిత ప్రశ్నలు
మెదడులో దుమ్ము రేపుకుంటూ
గతం వర్తమానంలోకి దూసుకువస్తుంటే
తేరిన మలినాలతో
రెప్పల రెక్కలు శుభ్రపడిన కళ్ళు
నిన్న కల ఆగినచోటే నిద్రనుతవ్వి తూర్పారపట్టి
కోరికలు బొట్లు బొట్లుగా
నల్లని మంచుగడ్డలా మారి
చల్లని సెగల మంటలకు
కొంగర్లు పోతున్న వాక్యాలు నుదుట దర్జాకు
మసకపడేలోగే వెలుగు వాకిలి తెరుచుకుని
నాలో వందమందిని తోడైసుకుని
నా నుండి బయటకొచ్చా...

శ్రీ సాహితి, 9704437247

గ్రంథ సమీక్ష

విభిన్నతను అందించే కథాసంపుటి

'కోరాపుట్ అండ్ అదర్ స్టోరీస్' అనే ఈ ఆంగ్ల కథాసంపుటిని చదవడం ఒక మరపురాని అనుభవంలా మిగిలిపోతుంది అంటే అతిశయోక్తి కాదు. గౌరహరిదాస్ ఒరియా భాషలో రాసిన కథల్ని ఇలా ఆంగ్లభాషలోకి సరోజ్ మిశ్రా, గోప నాయక్ అనువదించారు. ఇంతకుముందు కూడా ఓ పుస్తకం వచ్చింది. దానిపేరు 'ద లిటిల్ మాంక్ అండ్ అదర్ స్టోరీస్'. పత్రికా సంపాదకునిగా, కథకునిగా, నాటక రచయితగా, కాలమిస్ట్‌గా గౌరహరిదాస్ ఒరియా పాఠకులకు ఎంతో తెలిసినవారు, రచనలో తనదైన ప్రత్యేక శైలి కలిగినవారు.

కోరాపుట్ అనే పేరు వినగానే ప్రకృతి దృశ్యాలు మన కళ్ళముందు మెదులుతాయి. అలాగే అక్కడి శ్రామిక జనుల వెతలూ గుర్తుకువస్తాయి. ఈ పుస్తకం లో మొత్తం 15 కథలు ఉన్నాయి. అవి అన్నీ కూడా వివిధ ఇతివృత్తాలతో కూడి ఉన్నాయి. మొదటి కథ కోరాపుట్‌తో సంబంధం ఉన్న కథ. కొన్ని కథల గురించి ముచ్చటించుకుందాము.

కథావ్యూహం కూడా పఠితని నిలవనివ్వదు. చివరిదాకా వెళ్ళు అంటుంది. కొద్దిసేపటిలో కథ అవబోతుంది అనుకున్నప్పుడు 'ఎండింగ్' తెలిసిపోయిందిలే అనిపిస్తుంది. కాని చివరి వాక్యాలకి వచ్చేసరికి ఊహించలేని ఒక ట్విస్ట్ ఇచ్చి మన పెదాలపై నవ్వుని తెప్పిస్తారు. ఎంతో సాధనతో, ఆలోచనాపటిమతోగాని అలాంటి విద్య వస్తుంది. కొన్ని ముఖ్యమైన దృశ్యాల్ని, మానసిక పరిస్థితుల్ని వర్ణించేటప్పుడు మనల్ని పరకాయ ప్రవేశం చేయిస్తారు ఆ పాత్రల్లోకి. మొదటి కథ కోరాపుట్ గురించి చెప్పుకుందాం. పూర్ణిమ అనే అమ్మాయి హీరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి కోరాపుట్ వస్తూంటుంది. అక్కడ ఉన్నత అధికారిగాగా పనిచేసే ప్రశాంత్ అనే వ్యక్తిని ఈమె త్వరలో పెళ్ళి చేసుకోవల్సిఉంది. కోరాపుట్‌లో రైలు దిగి, ప్రభుత్వ కార్యాలయాలు ఉండే జేపూర్‌కి వెళ్ళడానికి టాక్సీ ఎక్కుతుంది. విధివక్రించి ఈమెని నక్సలైట్లు కిడ్నాప్ చేస్తారు. లోపల ఎక్కడో ఉండే ఓ గ్రామంలో ఈమెని ఉంచుతారు. పారిపోవడానికి దారితెలియదు. అక్కడ ఉండే పరిస్థితులు ఘోరంగా ఉంటాయి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా ఇంకా కొంతమంది ప్రజలు ఎలా జీవిస్తున్నారో అర్థమవుతుంది.



తాను పెళ్ళాడబోయే ప్రశాంత్ కూడా అవినీతి అధికారుల్లో ఒకడని తెలిసి హతాశురాలవుతుంది. అతని వద్ద నుంచి డబ్బు, కొన్ని ప్రయోజనాల్ని పొందిన తర్వాత గాని తీవ్రవాదులు ఆమెని విడిచిపెట్టరు. ఈ కథలో ఒరియా, ఆంధ్రా బోర్డర్‌లోని గిరిజనుల స్థితిగతుల్ని, జీవనాన్ని కళ్ళకి కడుతుంది. కోరాపుట్ అందచందాల్ని వివరిస్తూంది.

'ఒన్స్ ద స్కై వజ్ బ్లూ' అనేది మరో వినూత్నమైన కథ. ఒక బంగ్లాదేశీ శరణార్థ కుటుంబం ఒరిస్సా రాష్ట్రంలో ఎదుర్కొనే వెతల్ని దీనిలో చిత్రించారు. మార్కెట్ ఎకానమీలో పెద్దచేప చిన్నచేపల్ని మింగే పద్ధతి అంతర్లీనంగా ఉంటుందనే సత్యాన్ని ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు.

'ద మిరేజ్' అనే కథ రాజకీయుల్ని ఆశ్రయించి మనుగడ సాగించే గూండాల జీవితాల్ని చిత్రించింది. పన్ను అనే గూండా...ఆ చుట్టుపక్కల 12 గ్రామాలకి హడల్. ఎంతో జాగ్రత్తగా ప్రత్యర్థుల్ని మట్టిగరిపించేతను, ఒక యువతి పెట్టిన చిన్నపరీక్షని సవాలుగా తీసుకుని, పాములున్న చెరువు లోకి దిగి తెల్ల కలువపూలు కోస్తూ విషనాగులుకి బలి అవుతాడు. ఈ కథ మొత్తం మనసుచేసే గారడిని మన ముందు పెడుతుంది. గ్యాంగ్‌స్టర్‌ల ఆలోచనా విధానాన్ని సూక్ష్మంగా వర్ణించారు గౌరహరిదాస్. పన్ను జీవితగమనాన్ని బాగా వాస్తవానికి దగ్గరగా చిత్రించారు.

'హేండ్ రైటింగ్' అనే కథలో ఒక ఉపాధ్యాయుడు తన దగ్గర చదివిన ఇద్దరు విద్యార్థుల జీవితాల్ని గమనించి ఆశ్చర్యపోతాడు. స్కూల్‌లో ఎంతో మంచిగా చదివి తన ఫేవరేట్ స్టూడెంట్‌గా ఉండే ఓ పిల్లాడు పెద్దయిన తర్వాత ఉన్నత అధికారిగా సెక్రటేరియట్‌లో ఉంటాడు. మరో స్టూడెంట్ పెద్దయి కండక్టర్ అవుతాడు. వారి ప్రవర్తన, ఆలోచనలను బట్టి చిన్నప్పుడు బాగా చదివేవాళ్ళందరికి గొప్ప హృదయం ఉంటుందని ఊహించుకోవడం తప్పని మేస్టారికి తెలుస్తుంది.

'వేర్ హేజ్ సుదాం జెనా గాన్" అనే కథ, విదేశీ మదుపుదారులు ఎలా దేశీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి వ్యవస్థల్ని తమ గుప్పిట్లో పెట్టుకుంటారు అనే విషయాన్ని వివరిస్తుంది. ఇంకా మిగిలిన కథలు దేనికి దానికే ప్రత్యేకత కలిగినవి. ఒరియా సమకాలీన కథా సాహిత్యంలో వస్తోన్న అనేక మార్పుల్ని మనం ఈ కథాసంపుటి ద్వారా తెలుసుకోవచ్చు.

మూర్తి కెవివిఎస్, 7893541003

వారికి చుక్కెదురే!

- 'ఆయా రామ్... గయారామ్' రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు
- స్పష్టం చేసిన యూపీ ఘోసీ ఉప ఎన్నికల ఫలితం

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లోని ఘోసీ ఉప ఎన్నికలో ఓటర్లు 'ఆయా రామ్... గయా రామ్' రాజకీయాలను తిరస్కరించారు. శుక్రవారం మౌ జిల్లాలోని ఘోసీ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దారా సింగ్ చౌహాన్‌పై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అభ్యర్థి సుధాకర్ సింగ్ 42,759 ఓట్ల తేడాతో విజయం సాధించారు. గత ఏడాది ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చౌహాన్ (అప్పట్లో ఎస్పీతో) బీజేపీ అభ్యర్థి విజయ్ కుమార్ రాజ్‌భర్‌పై 22,216 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకారం, 'ఇండియా' కూటమిలోని ఇతర పార్టీల మద్దతుతో ఎస్పీ ఈ స్థానాన్ని నిలుపుకుంది. సింగ్‌కు 1,24,427 ఓట్లు (57.19 శాతం), చౌహాన్‌కు 81,668 ఓట్లు (37.54 శాతం) వచ్చాయి. 10 మంది అభ్యర్థుల్లో ఆరుగురికి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. పీస్ పార్టీకి చెందిన సనావుల్లా 2,570 ఓట్లతో మూడో స్థానంలో నిలవగా, జన్ అధికార్ పార్టీకి చెందిన అఫ్రోజ్ ఆలం 2,100 ఓట్లు సాధించారు. నోటాకు 1,725 ఓట్లు పోలయ్యాయి. ఉప ఎన్నికలో 50.77 శాతం ఓటింగ్ నమోదయింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం 58.59 గా ఉంది. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) నాయకుడు చౌహాన్ సమాజ్‌వాది పార్టీని విడిచిపెట్టి, బీజేపీలో చేరడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికలో చౌహాన్ ఓటమి సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్ రాజకీయ అవకాశాలను కూడా దెబ్బతీసింది. చౌహాన్ తన విధేయతను బీజేపీకి మార్చడంపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ విధేయతను మార్చుకునే ఈ తిరుగుబాటుదారుల విషయం ఓటర్లకు తెలుసునని, అందుకే ప్రజలు తిరస్కరించారని మెడికల్ రిప్రజెంటేటివ్ అరవింద్ కుమార్ చౌహాన్ అన్నారు. సామాజిక కార్యకర్త అరవింద్ కుమార్ రాజ్‌భర్ మాట్లాడుతూ 'ఉప ఎన్నికల ముందు 'బహరీ భగావో, ఘోసీ బచావో' (ఘోసీని రక్షించడానికి బయటి వ్యక్తులను తరిమికొట్టండి) అనే నినాదాన్ని రూపొందించారు. 'ఆయారాం... గయా రామ్‌లో మునిగి తేలుతున్న వారిని ఓటర్లు కూడా పూర్తిగా తిరస్కరించారు. వారికి తలుపులు మూసివేశారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు' అని తెలిపారు. చౌహాన్ జులై 15న అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానాకు తన రాజీనామాను సమర్పించారు. ఆయన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్రంలోని మునుపటి బీజేపీ ప్రభుత్వంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా పని చేశారు, జనవరి 2022లో మంత్రి మండలికి రాజీనామా చేసి ఎస్పీలో చేరారు. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) లో సభ్యునిగా 15వ లోక్‌సభలో ఘోసీ పార్లమెంటరీ స్థానానికి ప్రాతినిధ్యం వహించాడు. చౌహాన్ 2017 నుంచి 2022 వరకు మౌలోని మధుబన్ నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోసీ అసెంబ్లీ స్థానం నుంచి ఎస్పీ టికెట్‌పై గెలుపొందారు. హరియానాలోని హోడల్ నుంచి ఎమ్మెల్యే అయిన గయాలాల్ 1967లో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికలలో గెలిచి, ఆపై కాంగ్రెస్‌లో చేరినప్పుడు 'ఆయా రామ్, గయా రామ్' అనే పదం రూపొందింది. ఆ తర్వాత ఆయన పక్షం రోజుల్లో మూడుసార్లు తన విధేయతను మార్చుకున్నాడు. మొదట కాంగ్రెస్ నుంచి యునైటెడ్ ఫ్రంట్‌కి, ఆ తర్వాత తిరిగి కాంగ్రెస్‌కు, ఆపై మళ్లీ తొమ్మిది గంటల్లో యునైటెడ్ ఫ్రంట్‌కి తిరిగి వచ్చాడు. ఆయన యునైటెడ్ ఫ్రంట్‌ను విడిచిపెట్టి కాంగ్రెస్‌లో చేరినప్పుడు, ఫిరాయింపులను రూపొందించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావు బీరేందర్ సింగ్ చండీగఢ్‌లో విలేకరుల సమావేశంలో గయాలాల్‌ను విలేకరుల ముందు హాజరుపరిచి ఇలా ప్రకటించాడు : 'గయా రామ్... ఇప్పుడు ఆయరామ్'. కాగా, ఎన్‌డీఏతో కానీ, 'ఇండియా' తో కానీ పొత్తు పెట్టుకోని బీఎస్పీ ఘోసీ ఉప ఎన్నికలో పోటీ చేయలేదు. 'ఇండియా' కూటమిలోని కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆర్ఎల్‌డీ, ఆప్, సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్, సుహెల్‌దేవ్ స్వాభిమాన్ పార్టీలు సింగ్‌కు మద్దతునిచ్చాయి. 64 ఏళ్ల సింగ్ 2012 నుంచి 2017 వరకు ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీలో ఘోసీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. అంతకుముందు, ఆయన అసెంబ్లీలో నాథుపూర్ (మధుబన్ తర్వాత) స్థానానికి ప్రాతినిధ్యం వహించాడు. 1996 అసెంబ్లీ ఎన్నికల్లో నాథుపూర్ నుంచి గెలుపొందారు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఫాగు చౌహాన్‌పై ఓడిపోయారు.

దిల్లీ డిక్లరేషన్‌కు భారీ కసరత్తు

న్యూదిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సులో నేతల మధ్య కుదిరిన దిల్లీ డిక్లరేషన్ పై ఏకాభిప్రాయం సాధించడానికి భారత దౌత్యవేత్తల బృందం విశేష కృషి చేసినట్లు షెర్పా అమితాబ్ కాంత్ ఆదివారం తెలిపారు. దాదాపు 200 గంటల పాటు నిరంతర చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అదనపు కార్యదర్శులైన ఈనం గంభీర్, కె.నాగరాజు నాయుడుతో కూడిన దౌత్యవేత్తల బృందం 300 ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. వివాదాస్పద ఉక్రెయిన్ అంశంపై ఇతర దేశాల్లోని తమ సహచరులతో 15 ముసాయిదాలను పంచుకున్నట్లు వివరించారు. వీరందరి కృషి వల్లే జీ20 సదస్సు తొలిరోజే నేతల మధ్య ఏకాభిప్రాయం సాధ్యమైందన్నారు. "మొత్తం జీ20 సదస్సు లో అత్యంత సంక్లిష్టమైన భాగం భౌగోళిక రాజకీయాలపై (రష్యా-ఉక్రెయిన్) ఏకాభిప్రాయం తీసుకురావడం. ఇది 200 గంటల పాటు నిరంతర చర్చలు, 300 ద్వైపాక్షిక సమావేశాలు, 15 ముసాయిదాల వల్లే సాధ్యమైంది. నాగరాజు నాయుడు, గంభీర్ ఈ విషయంలో తనకు ఎంతో సహకరించారు" అని అమితాబ్ కాంత్ చెప్పారు. జీ20 కూటమి అధ్యక్ష హోదాలో భారత్ శనివారం పెద్ద విజయాన్ని నమోదు చేసింది. అనేక అంశాలపై భాగస్వామ్య దేశాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయాన్ని సాధించగలిగింది. ఉక్రెయిన్ యుద్ధం అంశంలో తలెత్తిన పీటముడిని చాకచక్యంగా పరిష్కరించగలిగింది. సంయుక్త ప్రకటనలో సంబంధిత పేరాను సవరించడం ద్వారా అన్ని దేశాల మద్దతును గెల్చుకోగలిగింది.

మోదీ విధానాలు ధనికులకు మేలు చేసేవే...

కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ

జైపూర్: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పేదలకు కాకుండా ధనికులకే మేలు చేసేలా ఉన్నాయని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఆదివారం మండిపడ్డారు. ఎన్నికల నేపథ్యంలో రాజస్థాన్‌లోని టోంక్ జిల్లాలోని నివాయ్‌లో జరిగిన పార్టీ ర్యాలీలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసంగిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు వెళుతున్నారని, తన పారిశ్రామికవేత్త స్నేహితుల కోసం ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని ఆరోపించారు. మోదీ విదేశాలకు వెళ్లి తిరిగి వచ్చి మన గౌరవం పెరిగిందని చెబుతుంటారని, ఆయన వెళ్లి పారిశ్రామికవేత్తల స్నేహితుల కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నారని, అక్కడి నుంచి బడా పారిశ్రామికవేత్తలు వ్యాపారం చేసుకుంటున్నారని తర్వాత తెలిసిందని ఆమె అన్నారు. ప్రతి విషయంలో మోదీ తన పారిశ్రామికవేత్త స్నేహితుల ప్రయోజనాలను ప్రజల కంటే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. పేదలు, మధ్యతరగతి వర్గాలను విస్మరించారని, అధికారంలో కొనసాగడమే బీజేపీ దృష్టి అని ఆమె అన్నారు. దిల్లీలోని జి20 సదస్సు వేదిక వద్ద నీటి ఎద్దడిని ప్రస్తావిస్తూ, ప్రియాంక గాంధీ ప్రధానిపై విరుచుకుపడ్డారు. 'బహుశా మన దేశ ప్రజలు భయం వల్ల ఏమి చెప్పలేకపోతున్నారని అన్నారు. 'మీ అహాన్ని తగ్గించుకోండి. ఇది దేశం మిమ్మల్ని నాయకుడిని చేసింది. దేశానికి మొదటి స్థానం ఇచ్చింది. ప్రజలను ఉన్నతంగా చేయండి' అని మోదీకి హితవు పలికారు. కాగా, రాజస్థాన్‌లో ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

బీహార్‌లో 81 వేల రైతులు పీఎం కిసాన్ పథకానికి అనర్హులు

పాట్నా: బీహార్‌లో 81 వేల మంది రైతులను ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకానికి అనర్హులుగా పరిగణించారు. వారి నుంచి వాపసు వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకులను ప్రభుత్వం కోరిందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ రైతులు ఆదాయపు పన్ను చెల్లించడం, ఇతర కారణాల వల్ల కేంద్ర ప్రభుత్వ కార్యక్రమానికి అనర్హులయ్యారని ఆయన చెప్పారు. 'సరైన పరిశీలన తర్వాత, బీహార్‌లో మొత్తం 81,595 మంది రైతులను (2020 నుంచి 45,879 మంది ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఇతర కారణాల వల్ల 35,716 మంది) అనర్హులుగా గుర్తించారు. రైతుల నుంచి దాదాపు రూ. 81.6 కోట్ల మొత్తాన్ని వసూలు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంబంధిత బ్యాంకులను కోరింది' అని డైరెక్టర్ (వ్యవసాయం) అలోక్ రంజన్ ఘోష్ పీటీఐకి తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో వసూళ్ల ప్రక్రియను ప్రారంభించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరినట్లు ఆయన చెప్పారు. రుణదాతలు అవసరమైతే అనర్హులకు తాజా నోటీసులు జారీ చేయాలని, అలాగే అటువంటి ఖాతాలను స్తంభింపజేయాలని కోరారు. ఈ రైతుల నుంచి కొన్ని బ్యాంకులు ఇప్పటి వరకు దాదాపు రూ.10.3 కోట్ల రీఫండ్ డబ్బులు వసూలు చేశాయని ఘోష్ తెలిపారు.

బైడెన్ కాన్వాయ్‌లో ప్రొటోకాల్ ఉల్లంఘన

డ్రైవర్ అరెస్ట్

న్యూదిల్లీ: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికా అధక్షుడు జో బైడెన్ (జీ20)కాన్వాయ్‌లోని ఒక డ్రైవర్‌ను దిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. కొద్దిసేపు ప్రశ్నించిన అనంతరం ఆ డ్రైవర్‌ని విడిచిపెట్టారు. యూఏఈ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జాయేద్ బస చేసిన తాజ్ హోటల్‌లోకి బైడెన్ కాన్వాయ్‌కి సంబంధించిన వాహనం ఒకటి ప్రవేశించిన క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్‌ను సెక్యూరిటీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా జో బైడెన్ బస చేసిన ఐటీసీ మౌర్యకు తాను వెళ్లాల్సి ఉందని, లోధి ఎస్టేట్ ప్రాంతం నుంచి తాను పికప్ చేసుకున్న ఒక వ్యాపారవేత్తను దిగబెట్టేందుకు తాను తాజ్ హోటల్‌కు వచ్చానని చెప్పినట్టు తెలిసింది. ప్రొటోకాల్ విషయం తనకు తెలియదని డ్రైవర్ బదులిచ్చాడు. జీ20 సదస్సుకు హాజరయ్యేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శుక్రవారం ఢిల్లీ చేరుకుని అదే రోజు ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన విషయం తెలిసిందే.

జాతిపితకు జీ20 నేతల నివాళి

న్యూదిల్లీ: జీ20 సదస్సు రెండో రోజైన ఆదివారం ఉదయం సభ్యదేశాల నేతలు జాతిపితకు పుష్పాంజలి ఘటించారు. అంతా రాజ్‌ఘాట్‌కు చేరుకొని మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీకి నచ్చిన సంగీతం, ఆయన జీవితం గురించి జీ20 దేశాధినేతలకు ప్రధాని మోదీ వివరించారు. మహాత్ముడికి నివాళి అర్పించిన వారిలో బ్రిటన్, కెనడా ప్రధానులు రిషి సునాక్, జస్టిస్ ట్రుడ్యూ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తదితర నాయకులు, అంతర్జాతీయ సంఘాల అధిపతులు ఉన్నారు.

ద్వైపాక్షిక చర్చల్లో మోదీ బిజీబిజీ

కెనడా, టర్కీ, దక్షిణ కొరియా, యూఏఈ దేశాధినేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్‌తో 'వర్కింగ్ లాంచ్' చేశారు. అనంతరం కొమొరోస్, యురోపియన్ యూనియన్, బ్రెజిల్, నైజీరియా దేశాధినేతలతోనూ మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపి కీలక అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో కొన్ని ఒప్పందాలు జరిగినట్లు సమాచారం.

వియత్నాంకు జోబైడెన్

జీ20 సమావేశాలు ముగిసిన అనంతరం అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ నేరుగా వియత్నాంకు పయనమయ్యారు.రాజ్‌ఘట్‌లోని మహాత్మ గాంధీ సమాధి వద్ద నివాళులర్పించిన తర్వాత ఆయన విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎయిర్ ఫోర్స్‌వన్ విమానంలో వియత్నాంకు బయల్దేరి వెళ్లారు. వియత్నాంతో ద్వైపాక్షిక బంధాన్ని బలపర్చుకోవడమే బైడెన్ పర్యటన ఉద్దేశంగా అమెరికా అధికార వర్గాలు తెలిపాయి. ఆయన రెండు రోజుల పాటు వియత్నాంలో గడుపుతారని వెల్లడించాయి.

అక్షరధామ్‌లో బ్రిటన్ ప్రధాని దంపతుల పూజలు

బ్రిటన్ ప్రధాని రుషి సునాక్ సతీసమేతంగా అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాను హిందువునని చెప్పుకోడానికి గర్వపడతానని రుషి సునాక్ ఇంతకుముందు వెల్లడించిన విషయం విదితమే.

విదేశీ అతిథులకు 'సంగీత' విందు

న్యూదిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారతీయ సంగీత వారసత్వ సంపదను చాటుతూ కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. శాస్త్రీయ - సమకాలీన సంగీత వాయిద్యాలతో విదేశీ అతిథులను మైమరిపించారు. గాంధర్వ ఆతిథ్యం బృందం 'భారత వాద్య దర్శనం' పేరుతో ప్రదర్శన ఆకట్టుకుంది. సంతూర్, సారంగీ, జల్ తరంగ్, షెహనాయ్, మోహన్ వీణతో పాటు దేశవ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో ప్రఖ్యాతిగాంచిన వాద్య పరికారలతో సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 34 హిందుస్తానీ, 18 కర్ణాటక సంగీతం, 26 జానపద సంబంధ పరికరాలను ఉపయోగించారు. మొత్తం 78 మంది కళాకారులు పాల్గొన్నారు. కొందరు దివ్యాంగులు కూడా ఉన్నారు. హిందుస్థానీ సంగీతంలో భాగంగా రాగ్ దర్బారీ కండా, కాఫీ-ఖెలత్ హోరిని ప్రదర్శించగా, జానపద సంగీతంలో రాజస్థాన్-కేసరియా బలమ్, ఘుమర్, నింబురా నింబురా వంటి రకరకాల సంగీతాల కచేరి దేశాధినేతలను కట్టిపడేసింది. మ్యూజికల్ జర్నీ ఆఫ్ భారత్ అనే థీమ్‌తో ఈ ప్రదర్శన నిర్వహించారు. కళాకారులంతా సంప్రదాయక వస్త్రధారణలో హాజరయ్యారు. రాష్ట్రపతి ఇచ్చిన విందులో భాగంగా సంగీత కచేరి జరిగింది.

ఆర్ఆర్ఆర్‌కు బ్రెజిల్ అధ్యక్షుడి ప్రశంస

రాజమౌళి హర్షం

న్యూదిల్లీ: ఆర్ఆర్ఆర్ సినిమాపై బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వ ప్రశంసల వర్షం కురిపించారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. దీనికి ఆ చిత్ర దర్శకుడు రాజమౌళి కూడా స్పందించారు. "సర్ ధన్యవాదాలు. దయతో కూడిన మీ వ్యాఖ్యలు నన్ను అమితానందానికి గురి చేశాయి. భారతీయ సినిమాను ప్రస్తావించడం, 'ఆర్ఆర్ఆర్'ను ఎంజాయ్ చేశానని మీరు చెప్పడంతో నా హృదయం ఉప్పొంగుతోంది. మా టీమ్ పరవశించిపోతోంది. మా దేశంలో మీరు అద్భుతంగా సమయం గడపాలని కోరుకుంటున్నా" అని రాజమౌళి ట్వీట్ చేశారు. జీ20 సదస్సులో పాల్గొనేందుకు దిల్లీ వచ్చిన లులా... ఈ చిత్రం గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఆర్ఆర్ఆర్ చిత్రం చూశారా అని తాను అందరినీ అడుగుతున్నానని, తనకు అంతలా ఆ సినిమా నచ్చిందని బ్రెజిల్ అధ్యక్షుడు లులా అన్నారు. మీరు చూసిన ఇండియన్ సినిమా గురించి చెప్పాలని యాంకర్ అడుగగా.. లులా స్పందించారు. ఆర్ఆర్ఆర్ గురించి చెప్పారు. "ఆర్ఆర్ఆర్.. ఇది మూడు గంటల ఫీచర్ ఫిల్మ్. చాలా మంచి సన్నివేశాలు, అందమైన డ్యాన్స్ ఆ సినిమాలో ఉన్నాయి. ఇండియాపై, భారతీయులపై బ్రిటీషర్ల నియంత్రణ గురించి ఆ సినిమా లోతుగా విమర్శించింది. అయితే దాన్ని సరైన రీతిలో అర్థవంతంగా చూపించడంతో ప్రపంచవ్యాప్తంగా సక్సెస్ అయింది. ఎవరినైనా కలిస్తే నేను ముందుగా.. మీరు ఆర్ఆర్ఆర్ సినిమా చూశారా అని అడుగుతున్నా. రాజకీయ విషయాలతో పాటు సినిమాలో చూపించిన డ్యాన్స్, జాయ్ చాలా బాగుంది. ఈ సినిమాలో నటించిన నటీనటులకు, డైరెక్టర్‌కు అభినందనలు చెబుతున్నా" అని బ్రెజిల్ అధ్యక్షుడు లులా అన్నారు.

జీ20 చర్చలపై భౌగోళిక రాజకీయ అంశాల ప్రభావం ఉండరాదు

బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా

న్యూదిల్లీ: జీ20లో చర్చలను భౌగోళిక రాజకీయ అంశాలతో పక్కదారి పట్టించరాదని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా స్పష్టం చేశారు. ఆదివారం వర్ధమాన, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల కూటమి (జీ20) అధ్యక్ష బాధ్యతల్ని స్వీకరించిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ జరిగిన జీ20 సదస్సు ముగింపు కార్యక్రమంలో లూలా ప్రసంగిస్తూ, కూటమికి 'విభజిత జీ20'పై ఆసక్తి లేదని, ఉమ్మడి చర్యల ద్వారానే ఈనాటి సవాళ్లను ఎదుర్కోగలమని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ లులాకు జీ20 అధ్యక్ష పదవిని అప్పగించారు. తదుపరి జీ20 శిఖరాగ్ర సదస్సు నవంబర్ 2024లో రియో డి జెనీరోలో జరుగనుంది. లులా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... 'న్యూదిల్లీ నుంచి రియో డి జెనీరోకు మనల్ని తీసుకెళ్లే మార్గానికి ప్రతి ఒక్కరి నుండి అంకితభావం, నిబద్ధత అవసరం' అని లూలా చెప్పారు. దేశంలోని ఐదు ప్రాంతాల్లో గల నగరాల్లో జీ20 సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై జీ20 కూటమి విడిపోయింది. దీనికి సంబంధించిన సూచనలను బలహీనపర్చిన తర్వాతనే న్యూఢిల్లీ డిక్లరేషన్‌పై కూటమి దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది. జీ20 డిక్లరేషన్ రష్యాపై నేరుగా విమర్శించలేదు. ప్రాదేశిక లాభం కోసం బలాన్ని ఉపయోగించడాన్ని మాత్రమే ఖండించింది. జి20 అధ్యక్ష హోదాలో బ్రెజిల్ ప్రాధాన్యతలను లులా వివరించారు. ఆర్థిక మార్గాలపై సమన్వయంతో, సమీకృత పద్ధతిలో పని చేయడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. 'ఉత్తమ పబ్లిక్ పాలసీని అమలు చేయడానికి వనరులు కేటాయించకపోతే దానిని అంగీకరించడంలో అర్థం లేదు' అని ఆయన అన్నారు. జీ20 అధ్యక్ష హోదాలో పౌర సమాజ నియామక గ్రూపులు... ప్రభుత్వానికి నేరుగా సిఫార్సులు, తీర్మానాలను నివేదించే అవకాశాన్ని పొందేలా చూస్తానని లూలా చెప్పారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం కలిగించే అంశాలకు లేవనెత్తేందుకు భారతదేశం చేస్తున్న కృషికి మోదీకి అభినందనలు తెలిపారు. ఆకలికి వ్యతిరేకంగా పోరాటం, శక్తి పరివర్తన, స్థిరమైన అభివృద్ధిని కూడా జీ20 ప్రాధాన్యతలుగా లూలా జాబితా చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో రాజకీయ బలం పుంజుకోవడానికి కొత్త అభివృద్ధి చెందుతున్న దేశాలు శాశ్వత సభ్యులుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ ప్రాతినిధ్యం కావాలని కోరుకుంటున్నామని బ్రెజిల్ అధ్యక్షుడు అన్నారు.

కేంద్రంలో కీలక పాత్ర పోషిద్దాం

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
ఎం.కె.స్టాలిన్

చెన్నై: 2024 లోక్‌సభ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి కేంద్రంలో తదుపరి ప్రభుత్వంలో పార్టీ కీలక పాత్ర పోషించేలా పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదివారం పిలుపునిచ్చారు. దేశ సంక్షేమం కోసం వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి విజయం సాధించాలని అన్నారు. పార్టీ నేవేలి ఎమ్మెల్యే సాబా రాజేంద్రన్ కుటుంబంలో వివాహ వేడుక సందర్భంగా పార్టీ కార్యకర్తలతో ఆయన వర్చువల్‌గా ప్రసంగిస్తూ, 'ఇండియా' కూటమి గెలిస్తేనే భారతదేశం రక్షించబడు తుంది' అని తెలిపారు, దేశం శ్రేయస్సు కోసం తమిళనాడులోని మొత్తం 39 లోక్‌సభ నియోజక వర్గాలు, పొరుగున ఉన్న పుదుచ్చేరిలోని ఒక నియోజకవర్గాన్ని డీఎంకే, దాని మిత్రపక్షాలు గెలవాలని స్టాలిన్ అన్నారు. మొత్తం 40 స్థానాల్లో భారీ విజయం సాధిస్తేనే పార్లమెంటు ఎన్నికల తర్వాత కేంద్రంలోని కొత్త పాలనలో డీఎంకే ముఖ్యమైన పాత్ర పోషించగలదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయం కోసం ఐక్యంగా పని చేసేందుకు పార్టీ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేయాలని డీఎంకే అధ్యక్షుడు కోరారు. 'నార్పతుం నమతే, నదుం నమతే (మొత్తం 40 సీట్లు మనవే, దేశం కూడా)' అని పార్టీ నినాదాన్ని లేవనెత్తారు.

బెంగాల్ గవర్నర్ పనిచేసేది బీజేపీ కోసమే...

టీఎంసీ ఆరోపణ



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్ అర్ధరాత్రి కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి రెండు సీల్డ్ లేఖలు పంపిన తరువాత అధికార టీఎంసీ ఆదివారం గవర్నర్‌పై విరుచుకుపడింది. 'ఉద్దేశపూర్వకంగా బీజేపీ తరపున ఘర్షణ ధోరణిని అవలంబిస్తున్నారు' అని ఆరోపించింది. మరోవైపు, రాష్ట్రంలోని అధికార పార్టీ 'రాష్ట్ర విద్యా వ్యవస్థలో గందరగోళాన్ని ప్రక్షాళన చేయడానికి ప్రయత్నిస్తున్నందుకు గవర్నర్‌పై దాడి చేసి అవమానపరిచింది' అని బీజేపీ ఆరోపించింది. టీఎంసీ రాజ్యసభ ఎంపీ శాంతను సేన్ మాట్లాడుతూ 'న్యూదిల్లీలో పోస్టింగ్‌కు ప్రతిఫలంగా బీజేపీకి చెందిన మంచి పుస్తకాలలో ఉండాలనే ఆయన కోరిక నుంచి' అర్ధరాత్రి గవర్నర్ రహస్య లేఖలు పంపిన తాజా చర్య ఉద్భవించిందని తెలిపారు. 'గవర్నర్ అన్ని నియమాలు, శాసనాలు, రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా రాష్ట్ర ఉన్నత విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన చర్యల్లో క్రమరాహిత్యాలను ఎత్తిచూపినప్పటికీ, గవర్నర్ నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారు. బీజేపీ మద్దతు కారణంగా ఘర్షణ వైఖరిని అవలంభించారు' అని సేన్ అన్నారు. టీఎంసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ మాట్లాడుతూ అర్ధరాత్రి వేళల్లో గవర్నర్ అతి చురుకుగా మారడంపై దృష్టి సారించాలని సూచించారు. 'ఆయన ఒకరి కోరిక మేరకు వ్యవహరిస్తున్నాడని, ఎవరి మాట వినడం లేదని స్పష్టంగా తెలుస్తుంది' అని అన్నారు. టీఎంసీ ఆరోపణలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ స్పందిస్తూ, 'గవర్నర్ గత దశాబ్దంలో ఉన్నత విద్యారంగంలో టీఎంసీ సృష్టించిన గందరగోళాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తు న్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో రాజకీయాకరణ, బెదిరింపుల శకాన్ని అంతం చేయడానికి ఆయన అదనపు సమయం పని చేస్తున్నారు' అని తెలిపారు. 'విద్యా రంగాన్ని మెరుగుపరచడంలో గవర్నర్ చొరవ ఇష్టపడని అధికార పార్టీ అత్యంత అవమానకర రీతిలో అవమానిస్తోంది. అనేక రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో అస్తవ్యస్త పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థుల భవితవ్యం గురించి పట్టించుకోవడం లేదు. వీసీ పదవిలో సొంత అభ్యర్థులను పెట్టేందుకు టీఎంసీ కఠోరమైన పక్షపాత విధానాన్ని అనుసరిస్తోంది' అని మజుందార్ విలేకరులతో అన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యావ్యవస్థను 'నాశనం' చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, విశ్వవిద్యాలయాల్లో 'తోలుబొమ్మ పాలన' నడుపుతున్నారని విద్యాశాఖ మంత్రి బ్రత్యా బసు ఆరోపించిన నేపథ్యంలో గవర్నర్ లేఖ రాశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి తీవ్ర విమర్శలు, దాడుల నేపథ్యంలో అర్ధరాత్రి 'చాలా పెద్ద చర్య' అని బోస్ గతంలో హెచ్చరించారు. రాజ్ భవన్ అధికారి ఒకరు మాట్లాడుతూ గవర్నర్ బోస్ 'రెండు రహస్య సీల్డ్ లేఖలపై సంతకం చేశారని, ఒకటి రాష్ట్ర సచివాలయానికి, మరొకటి కేంద్రానికి అని తెలిపారు. లేఖల్లోని విషయాలను తరువాత వెల్లడిస్తామని అన్నారు. గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఇటీవల జరిగిన మాటల యుద్ధంపై ఈ అంశం ఉండవచ్చని సూచనప్రాయంగా చెప్పారు. యాదృచ్ఛికంగా, రాజ్‌భవన్‌లో ప్రధాన కార్యదర్శి హెచ్.కె.ద్వివేదితో విస్తృతమైన సమావేశం నిర్వహించిన కొన్ని గంటల తర్వాత బోస్ లేఖలపై సంతకం చేశారు. ఇదిలాఉండగా, పశ్చిమ బెంగాల్ విద్యావేత్తల వేదిక ఒక ప్రకటనలో, అర్ధరాత్రి చర్యపై బోస్ చేసిన వ్యాఖ్యను 'బెదిరింపులు'గా అభివర్ణించింది. ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదాలో గవర్నర్ ఇటీవల ఎనిమిది వర్సిటీలకు తాత్కాలిక వీసీలను నియమించారు.

క్షణం... క్షణం... ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: క్షణం... క్షణం ఉత్కంఠ... పోటాపోటీగా వాదనలు... మధ్య మధ్యలో విరామాలు... వెరసి స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు విచారణ ముగిసింది. విజయవాడ ఏసీబీ కోర్టు హాలులో దాదాపు ఎనిమిది గంటలపాటు సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయిన చంద్రబాబును వైద్య పరీక్షల అనంతరం ఆదివారం ఉదయం 6 గంటలకు కోర్టులో సీఐడీ అధికా రులు ప్రవేశపెట్టారు. కోర్టు హాలులోకి చంద్రబాబు పక్షాన 15 మంది, సీఐడీ తరపున 15 మంది న్యాయవాదులకు న్యాయమూర్తి అనుమతిచ్చారు. చంద్రబాబు తరపున దిల్లీ నుంచి వచ్చిన ప్రముఖ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, మరో న్యాయవాది పోసాని వెంకటేశ్వరరావు విడతల వారీగా, సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. మధ్యలో వచ్చిన విరామంలో చంద్రబాబు తన న్యాయవాదులతో భేటీ అవుతూ సమాలోచనలు చేశారు. కోర్టు హాల్లోకి లోకేశ్, భువనేశ్వరి హాజరయ్యారు. అటు సీఐడీ తరపున ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అందుకు దీటుగా తగిన ఆధారాలతో వాదనలు వినిపించారు. దీంతో రెండు పక్షాల వాదనలతో కోర్టు ప్రాంగణం వేడెక్కింది. ఈ కేసులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనే దిశగా, కేసుతో సంబంధం లేని న్యాయవాదులు సైతం వాదనలను తిలకించేందుకు హాలులోకి వచ్చారు. దీంతో కోర్టు హాలు కిక్కిరిసిపోయింది. దీనిని గమనించిన న్యాయమూర్తి అనుమతించిన వారినే కోర్టులో ఉండాలంటూ సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి కుంభకోణం కేసులో చంద్రబాబు తరపున లూథ్రా అనేక అంశాలను ప్రస్తావిస్తూ వాదనలను ప్రారంభించారు. 409 సెక్షన్, ప్రివెన్షన్ ఆఫ్ కరెక్షన్ యాక్టుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన రిమాండ్ రిపోర్టును తిరస్కరించాలని న్యాయమూర్తిని కోరారు. దీనికి సంబంధించిన అనేకమైన గత సుప్రీం కోర్టు తీర్పులను ఉటంకిస్తూ, కోర్టు దృష్టికి ఆయన తీసుకొచ్చారు. ఇంకా చంద్రబాబుపై నమోదు చేసిన అనేక సెక్షన్ల పైనా లూథ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. 409 చంద్రబాబుకు వర్తిస్తుందంటూ సీఐడీ తరపున పొన్నవోలు సమగ్రంగా వివరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విరామాల పర్వం నడుమ ఈ కేసు వాదనలు నడిచాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజన విరామాన్ని ఏసీబీ కోర్టు ప్రకటించింది. మళ్లీ 1.30 తర్వాత కోర్టులో విచారణ ప్రారంభించగా, దాదాపు 2.50 నిముషాలకు ఈ అవినీతి కేసులో రెండు పక్షాల వాదనలు ముగిశాయి. ఆ తర్వాత న్యాయమూర్తి కేసు తీర్పును రిజర్వు చేశారు. అప్పటినుంచి రెండు పక్షాల్లో టెన్షన్ మొదలైంది. చంద్రబాబుకు బెయిల్ వస్తుందా?, లేక జైలుకు వెళతారా? అనేది ఉత్కంఠగా మారింది.

చంద్రబాబు తరపున సిద్దార్థ లూథ్రా వాదనలివీ

గవర్నరు అనుమతి లేకుండా అరెస్టు చేయకూడదంటూ చంద్రబాబు తరపున ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు బలంగా ప్రారంభించారు. తొలుత అసలు 409 సెక్షన్ పెట్టాలంటే సరైన ఆధారాలు చూపాలని, ఒక మాజీ ముఖ్యమంత్రి అవి పెట్టడం సరికాదన్నారు. 24 గంటల్లోపు కోర్టులో ప్రవేశపెట్టలేదని, ఈ విషయంలో చంద్రబాబు ప్రాథమిక హక్కులను సీఐడీ అధికారులు కాలరాశారన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్టు (పీసీ) సెక్షన్ పెట్టే ముందు తగిన నిబంధనలను పాటించలేదన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ కుంభకోణం రాజకీయ ప్రేరేపితమైందని, రాజకీయ కోణంలోనే చంద్రబాబును ఇరికించాలని చూశారని, చంద్రబాబుపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలేనన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఉన్న సీఐడీ అధికారుల కాల్ డేటా సమర్పించాలని, దాని ఆధారంగా అరెస్టు విషయం తెలుస్తుందన్నారు. వారి వివరాలను కోర్టుకు అందజేసేలా ఆదేశించాలని, అరెస్టు సమయంలో వ్యక్తిని కదలకుండా చుట్టుముట్టడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనేనని నొక్కిచెప్పారు. అనంతరం 17-ఎ సెక్షన్‌పై న్యాయవాది లూథ్రా వివరించారు. సీఐడీ ఆరోపిస్తున్నట్లుగా చంద్రబాబు లండన్‌కు వెళ్లడం లేదన్నారు. నిబంధనల మేరకు సీఐడీ నడుచుకోలేదన్నారు. సెక్షన్ 24 పైన న్యాయవాదులు వాదనలు వినిపించారని, ఏపీ ప్రభుత్వం చంద్రబాబును టార్గెట్ చేసిందని వాదించారు. అవినీతి నిరోధక చట్టంపై ఏసీబీ మాత్రమే కేసు నమోదు చేయాలన్నారు. చంద్రబాబుకు రిమాండ్ విధిస్తే, వెంటనే బెయిల్ పిటిషన్‌పై విచారించాలని కోరారు.

సీఐడీ తరపున ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు వాదనలివీ

సీఐడీ తరపున ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ముమ్మాటికీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు పాత్ర ఉందన్నారు. చంద్రబాబు అరెస్టుకు ముందు గవర్నర్ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని నొక్కిచెప్పారు. అరెస్టుకు ముందు స్పీకర్‌కు సమాచారం ఇచ్చామని, అన్ని నియమాలను మేం పాటించామని చెప్పారు. చంద్రబాబు మాజీ సీఎం అనేదీ గౌరవ ప్రదమైన హోదా మాత్రమేనని అన్నారు. చంద్రబాబు ప్రస్తుత హోదా ఒక ఎమ్మెల్యే మాత్రమేనని స్పష్టం చేశారు. అరెస్టు చేసిన మూడు నెలల్లోపు గవర్నర్‌కు ఎప్పుడైనా సమాచారం ఇవ్వొచ్చు అని తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం, అవినీతి కేసులో ముందస్తు నోటీసులు అవసరం లేదన్నారు. చంద్రబాబు అవినీతి చేయలేదని ఆయనకు చెందిన న్యాయవాదులే చెప్పలేక పోతున్నారని పొన్నవోలు తెలిపారు.

రాజకీయ కక్షతోనే అరెస్టు : చంద్రబాబు



ఏసీబీ కోర్టులో మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు తన వాదనలకు స్వయంగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కోర్టులో తన వాదనలను రెండు సార్లుగా న్యాయమూర్తికి వినిపించారు. 2021 డిసెంబరు 9 నాటికి ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదన్నారు. అప్పటి రిమాండ్ రిపోర్ట్‌లో తన పాత్ర ఉందని ప్రస్తావించలేదని గుర్తుచేశారు. గవర్నర్ అనుమతి లేకుండా తనను అరెస్టు చేశారని, తన అరెస్ట్ అక్రమం అని అన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బడ్జెట్‌ను తప్పుగా వ్యవహరించలేమని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు 2015-16 బడ్జెట్‌లో పొందుపరిచామని, రాష్ట్ర అసెంబ్లీ కూడా ఆమోదించిందని గుర్తుచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు కేబినెట్ నిర్ణయమని, ప్రభుత్వ నిర్ణయాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీలులేదన్నారు. రాష్ట్రంలో పూర్తిగా కక్ష సాధింపు పాలన కొనసాగిస్తున్నారని, ప్రజాస్వామ్యం, వ్యవస్థలపై అధికారం చెలాయిస్తున్నారని చెప్పారు. పౌర హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతోందంటూ చంద్రబాబు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ఘోసి ఫలితాలతో విజయపథంలో 'ఇండియా'

అతుల్ కుమార్ అంజాన్

న్యూదిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ఘోసి ఫలితాలతో ఇండియా కూటమి విజయ పథంలో ముందుకు సాగుతోందని సీపీఐ కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ అన్నారు. ఈ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి భారీ మెజారిటీతో గెలిచిందని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 80 స్థానాల్లో గెలిచేందుకు విపక్ష కూటమికి మార్గం సుగమమైందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన చేశారు. 42వేలకుపైగా ఓట్లతో ఇండియా కూటమి గెలిచిందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ మతోన్మాదాన్ని, కుల వాదాన్ని, ధన రాజకీయా లను సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, ఆర్ఎల్‌డీ కలిసి ఓడించాయని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని స్థానిక ఎన్నికల్లో, ఏడు పంచాయతీ స్థానాల్లో బీజేపీ ఓడిపోయిందని అతుల్ కుమార్ వెలడించారు. గ్రామీణులు, కార్మికులు, మధ్యతరగతి, అణగారిన వర్గాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే మోదీ-యోగి విధానాలను తిరస్కరించినందుకు,ఇండియా కూటమికి మద్దతిచ్చినందుకు యూపీ ప్రజలకు అతుల్ కుమార్ అంజాన్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ, పోలీసు చర్యలను ఖండిస్తూ
రేపు సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ప్రభుత్వ , పోలీసు దుందుడుకు చర్యలను ఖండిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో జగన్‌మోహనరెడ్డి అరాచక పాలన సాగిస్తున్నారని, ఏపీలో పోలీస్ రాజ్యం నడుస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలపై దాడులు, వేధింపులు, అక్రమ అరెస్టులు నిత్యకృత్య మయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు నిర్వ హించే శాంతియుత ప్రజా ఉద్యమాలపై పోలీసులతో ఉక్కుపాదం మోపుతున్నారని విమర్శించారు. చట్ట ప్రకారం వ్యవహరించాల్సిన కేసులలో కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. అందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, ప్రభుత్వ నిరంకుశ విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, లాయర్లు, మేధావులు తదితరులు పాల్గొననున్నారని చెప్పారు.

భారత్-పాక్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం

కొలంబో: ఆసియా కప్‌లో భాగంగా ఇక్కడి ప్రేమదాస స్టేడియంలో భారత్-పాకిస్తాన్ సూపర్ 4 వన్డే మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించాడు. వాన ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. అయితే.. సోమవారం రిజర్వ్ డే ఉండడంతో 50 ఓవర్ల ఆటకు అవకాశం ఉంది. 24.1వ ఓవర్ వద్ద ఆట ఆగిపోయే సమయానికి భారత జట్టు వర్షం కారణంగా భారత్ 147/2 స్కోరుతో పటిష్ఠ స్థితిలో ఉంది. విరాట్ కోహ్లీ(8), కేఎల్ రాహుల్(17) ఆడుతున్నారు. సోమవారం యథావిధిగా భారత్ 24.1 ఓవర్ నుంచి ఇన్నింగ్స్ కొనసాగించనుంది.

అదరగొట్టిన ఓపెనర్లు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు రోహిత్ శర్మ(56-49 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్(58-52 బంతుల్లో 10 ఫోర్లు) శుభారంభం ఇచ్చారు. వీరిద్దరూ పాక్ పేస్ త్రయాన్ని దీటుగా ఎదుర్కొంటూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. వీళ్ల ధాటికి భారత్ 15 ఓవర్లలోనే 115 పరుగులు సాధించింది. అయితే షాదాబ్ ఖాన్ ఓవర్లో భారీ షాట్ ఆడిన రోహిత్ ఔటయ్యాడు. ఆ తర్వాత షాహీన్ అఫ్రిదీ ఓవర్లో అఘా సల్మాన్ చేతికి క్యాచ్ ఇచ్చి గిల్ వెనుదిరిగాడు. దాంతో, 124 పరుగుల వద్ద ఇండియా రెండో వికెట్ కోల్పోయింది. అనంతరం కోహ్లీ, రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. 24వ ఓవర్ సమయంలో వాన మొదలైంది. వర్షం తగ్గడంతో 8:30 నిమిషాలకు అంపైర్లు పిచ్‌ను పరిశీలించడానికి వెళ్లారు. అప్పటికే గ్రౌండ్ సిబ్బంది ఫ్యాన్లతో పిచ్, ఔట్ ఫీల్డ్‌ను ఆరబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

సహజ సంపద లూటీ కోసమే...

- మణిపూర్‌లో ఘర్షణలు సృష్టించారు
- బీజేపీ కుటిల రాజకీయాలకు ప్రజలు బలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి వినయ్ విశ్వం

విశాలాంధ్ర-హైదరాబాద్: సహజ సంపద, వనరులను లూటీ చేయాలనే కార్పొరేట్ దురాశకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాజకీయ అండదండలే మణిపూర్ జాతుల మధ్య ఘర్షణలకు ప్రధాన కారణమని సీపీఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు, జాతీయ కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. మణిపూర్ తల్లులు, సోదరీమణులతో దేశమంతా వెన్నంటి ఉన్నదని తెలిపారు. ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రగల్భాలు పలికారని, కానీ ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో ఒక్కసారైనా పర్యటించలేదని విమర్శించారు. బీజేపీ కుటిల, సంకుచిత రాజకీయాలకు మణిపూర్ ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని, అక్కడ హింసకు ముగింపు ఎప్పుడో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు, సుప్రసిద్ధ జర్నలిస్టు సి.రాఘవాచారి జయంతిని పురస్కరించుకొని రాఘవాచారి ట్రస్ట్, నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధనా కేంద్రం, సిఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్ (పాత ప్రెస్ క్లబ్) లో ఆదివారం 'మణిపూర్ ఒక రాజకీయ విశ్లేషణ' అనే అంశంపై సదస్సు జరిగింది. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వినయ్ విశ్వం కీలకోపన్యాసం చేశారు. ఐజేయూ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఐడీపీడీ ఉపాధ్యక్షులు డాక్టర్ రజని ప్రసంగించారు. సభకు రాఘవాచారి ట్రస్టు ట్రస్టీలు బుడ్డిగ జమిందార్ అధ్యక్షత వహించగా, డాక్టర్ అనుపమ ట్రస్టు కార్యకలాపాలను వివరించారు. మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖర్ రావు వందన సమర్పణ చేశారు.

జాతుల ఘర్షణ నేపథ్యంలో మణిపూర్‌లో రెండు సార్లు పర్యటించిన వినయ్ విశ్వం ఉపన్యసిస్తూ, మణిపూర్ ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాని మోదీ అనేక దేశాలలో పర్యటించారే తప్ప మణిపూర్ మాత్రం వెళ్లలేదన్నారు. చివరకు పార్లమెంటులో అవిశ్వాస పరీక్షపై చర్చకు మోదీ సమాధానమిస్తూ మణిపూర్ భారతదేశంలో ఉన్నదని ప్రకటించారని, కనీసం ప్రచారం కోసమైన పార్లమెంటు సమావేశాల మరుసటి రోజు మణిపూర్ వెళ్లి వస్తారని భావించామని, కానీ వెళ్లలేదని తెలిపారు. మణిపూర్‌లో జరుగుతున్నది కేవలం ఆర్థిక, సాంస్కృతిక, జాతుల సంఘర్షణ మాత్రమే కాదని, వీటి వెనుక కార్పొరేట్ ధన దాహం ఉన్నదని విమర్శించారు. ఆదివాసీ ప్రాంతాలైన మణిపూర్ కొండల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదపై అదానీ కన్నుపడిందని, అందుకే ఆయనకు లాభం చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వాలు జాతుల ఘర్ష ణకు తెరలేపాయన్నారు. మే 3వ తేదీ నుంచి మైతీలు, కుకీల మధ్య ఘర్షణలు కొనసాగుతు న్నాయని, మణిపూర్ గాయాలతో రక్తమోడు తున్నదని, ఇవి ఎప్పుడు అంతమవుతాయో అనేది ఇప్పటికీ ప్రశ్నలాగే మిగిలిపోయిందన్నారు. నాలుగు మాసాలుగా వేర్వేరు శిబిరాల్లో మగ్గుతున్న మైతీలు, కుకీలు సొంతిళ్లకు ఎప్పుడు వెళతారో తెలియక బిక్కుబిక్కుమంటూ బతుకులు ఈడుస్తున్నారని చెప్పారు. బీజేపీ కేవలం తన అధికార స్వార్థం కోసం మైతీల భుజాలపై ఒక చేయి, కుకీల భుజాలపై మరో చేయి వేసి, బ్రిటీష్ వారి విభజించు పాలించు విధానాన్ని అమలు చేసి ఘర్షణలకు కారణమైందన్నారు. రెండు జాతుల ప్రజలు కూడా బీజేపీపై విశ్వాసం కోల్పోయారని, బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని, ముఖ్యమంత్రి ఘర్షణలను నిరోధించడంలో విఫలమయ్యారని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. గతంలో కుకీలు, మైతీలు ఘర్షణ పడినా కొద్ది రోజులకు సమసిపోయి కలిసిపోయేవారని, ఇప్పుడు బీజేపీ కుటిలత్వం కారణంగా ఘర్షణలకు ఎప్పుడు ముగింపో కూడా తెలియడం లేదని వినయ్ విశ్వం అన్నారు. మణిపూర్ ప్రభుత్వం నడుపుతున్నది సహాయక శిబిరాలు కావని, శరణార్థుల శిబిరాలు అని, సొంత దేశంలోనే మణిపూర్ వాసులు శరణార్థులలాగా దుర్భరంగా బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి మణిపూర్ ఒక హెచ్చరిక లాంటి దని, ప్రజలంతా ఏకమై దేశ ఐక్యతను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను చెబుతున్నదన్నారు.

ప్రతిపక్షాల ఐక్యతతోనే తెరపైకి 'భారత్'

బీజేపీ విచ్ఛిన్నకర విధానాలకు వ్యతిరేకంగా 28 రాజకీయ పార్టీలు 'ఇండియా' పేరుతో కూటమిగా ఏర్పడ్డాయని, దీంతో బీజేపీ ప్రభుత్వం ఏకంగా భారతదేశం పేరును ఇండియా నుంచి భారత్‌గా మార్చాలని చూస్తున్నదని వినయ్ విశ్వం విమర్శించారు. దశాబ్దాలుగా భారతదేశాన్ని ఇండియా అని పిలుస్తున్నారని, అదే సమయంలో భారత్ అని కూడా అంటున్నారని, ఈ రెండు పేర్లలో దేనితోనైనా పిలవొచ్చన్నారు. ప్రతిపక్ష కూటమి పేరు 'ఇండియా' అని ఉండడంతో పాటు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఇష్టానుసారం భారత్ అని మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు.

రాఘవాచారి బహుముఖ ప్రజ్ఞాశాలి

రాఘవాచారితో తనకు పరిచయం ఉన్నదని, ఆయన గొప్ప మార్క్సిస్ట్ జర్నలిస్టు అని వినయ్ విశ్వం కొనియాడారు. కమ్యూనిస్టు జర్నలిస్టుగా జీవితాంతం పార్టీ పత్రిక విశాలాంధ్రకు ఒక స్తంభంగా నిలబడ్డారని గుర్తు చేశారు. రాఘవాచారి గొప్ప ఆలోచనాపరుడు, రాజకీయ మేధావి, జర్నలిస్టు, సాంస్కృతిక జ్ఞాని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు.

సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న మణిపూర్‌లో నిత్యం ఘర్షణ మంటలు ఆరడం లేదని విమర్శించారు. మణిపూర్ నుంచి బర్మా, నేపాల్ సరిహద్దుల మధ్య కంచెలు కూడా లేవని అన్నారు. గతంలో తాను మణిపూర్‌కు వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులను చూసి నిర్ఘాంత పోయానని, కనీసం రవాణా, రహదారుల సౌకర్యం లేదని, పరిశ్రమలు కూడా లేవని వివరించారు. గతంలో అక్కడ వ్యక్తిగతంగా మాత్రమే ఘర్షణ వాతావరణం ఉండేదని, ఇప్పుడు రెండు జాతుల మధ్య ఘర్షణలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాఘవాచారి సంపాదకీయాలు అద్భుతంగా, విశ్లేషణాత్మకంగా ఉండేవని కొనియాడారు. కొత్తగా బీజేపీ ఏర్పడినప్పుడు తమది 'గాంధీ-సోషలిజం' అని చెప్పుకున్నారని, దానిపైన రాఘవాచారి రాసిన సంపాదకీయంలో గాంధీ తన మాటల్లో ఎప్పుడూ సోషలిజాన్ని ప్రస్తావించలేదని, అలాగే గాంధీని బీజేపీ ఎన్నడూ విశ్వసించలేదని, అలాంటిది గాంధీ-సోషలిజం ఏమిటోనని రాసిన విషయాన్ని సురవరం గుర్తు చేశారు. కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం తాము మణిపూర్ వెళ్లినప్పుడు అక్కడి పరిస్థితులపైన మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడామని, సమస్య పరిష్కారానికి రాజకీయ నిబద్ధత ఉండాలని, అది ఈ ప్రభుత్వాలకు లేదని ఆయన తమతో చెప్పినట్టు వివరించారు. దేశంలో ఏర్పడుతున్న ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొని, వాటిని పరిష్కరించేందుకు వామపక్షాలు, ప్రగతిశీల శక్తులు ముందుకువెళ్లాలన్నారు. కాగా, ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్ (ఐడీపీడీ) వైద్యుల బృందం మణిపూర్ శరణార్థుల శిబిరాలను సందర్శించిన వివరాలను డాక్టర్ రజని వివరించారు. శిబిరాల్లో పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని, మందులు, సరైన ఆహారం అందడం లేదని, వారికి వైద్య మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. డయాలసిస్ తదితర సమస్యలతో 10 మంది వరకు మృతి చెందారని తెలిపారు.

'ఇండియా' భయంతోనే 'భారత్'

కేంద్రంపై రాహుల్ గాంధీ ధ్వజం

లండన్: ఇండియా వర్సెస్ భారత్ రగడపై కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. భారతదేశ ఆత్మపై దాడి చేస్తున్నవారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను హెచ్చరించారు. దేశం పేరును మార్చేందుకు ప్రయత్నిస్తున్న వారు మౌలికంగా చరిత్రను నిరాకరిస్తున్నారని ఆయన తెలిపారు. పారిస్‌లో విద్యార్థులు, విద్యా వేత్తలతో చర్చా కార్యక్రమం సందర్భంగా బీజేపీపై విరుచుకుపడ్డారు. పాలక పక్షం ఎలాగైనా అధికారాన్ని పొందాలనే తపనతో ఉందని, వారి చర్యలతో హిందువులకు ఒరిగేదేమీ లేదని అన్నారు. పారిస్‌లోని ప్రముఖ సాంఘిక శాస్త్రాల విద్యా సంస్థ సైన్సెస్ పీఓ యూనివర్సిటీలో శనివారం జరిగిన చర్చా కార్యక్రమం సందర్భంగా 53 ఏళ్ల ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన 'భారత్ జోడో యాత్ర', ప్రతిపక్ష కూటమి పోరాటం వంటి విస్తృత అంశాలను ప్రస్తావించారు. భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణాలు, మారుతున్న అంతర్జాతీయ క్రమం, ఇతర కీలక సమస్యలపై మాట్లాడారు. భారతదేశ 'ఆత్మ' కోసం పోరాడేందుకు ప్రతిపక్షాలు కట్టుబడి ఉన్నాయని, ప్రస్తుత 'కల్లోలం' నుంచి దేశం 'చక్కగా బయటకు వస్తుంది' అని ఆయన నొక్కి చెప్పారు. 'నేను 'గీత' చదివాను. నేను అనేక ఉపనిషత్తులు చదివాను. చాలా హిందూ పుస్తకాలు చదివాను. బీజేపీ చేసే పనుల్లో హిందువులకు ఏమీలేదు. కచ్చితంగా ఏమీ లేదు' అని గాంధీ అన్నారు. చర్చ సందర్భంగా దేశంలో 'హిందూ జాతీయవాదం' పెరగడం గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా, ఆదివారం విడుదల చేసిన వీడియోలో, నేను ఎక్కడా చదవలేదు. ఏ హిందూ పుస్తకంలో, ఏ పండిత హిందువు నుంచి నీకంటే బలహీనమైన వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేయాలని, హాని చేయాలని నేను ఎప్పుడూ వినలేదు. అందువల్ల, ఈ ఆలోచన, ఈ పదం, హిందూ జాతీయవాదులు ఇది తప్పు పదం. వారు హిందూ జాతీయవాదులు కాదు. వారికి హిందూ మతంతో సంబంధం లేదు. వారు ఏ విధంగానైనా అధికారాన్ని పొందేందుకు సిద్ధంగా ఉన్నారు. అధికారం కోసం వారు ఏదైనా చేస్తారు. వారు కొంతమంది వ్యక్తుల ఆధిపత్యాన్ని కోరుకుంటారు. దాని గురించి వారు చెప్పారు. వారిలో హిందువులది ఏమీ లేదు' అని ఆయన తెలిపారు. భారతదేశంలోని 60 శాతం మంది ప్రతిపక్ష పార్టీలకు ఓటు వేయగా, కేవలం 40 శాతం మంది అధికార పార్టీకి ఓటు వేశారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నొక్కి చెప్పారు. 'అందువల్ల, మెజారిటీ సామాజిక వర్గం బీజేపీకి ఓటు వేస్తున్నారన్నది తప్పుడు ఆలోచన. మెజారిటీ సామాజిక వర్గం వారు వారికి ఓటు వేసిన దానికంటే మాకు ఎక్కువ ఓట్లు వేస్తారు' అని ఆయన నొక్కి చెప్పారు. భారత రాజ్యాంగంలో ఇండియా, భారత్ రెండు పదాలు ఉన్నాయని, రెండు పదాలు సరైనవేనని అన్నారు. 'భారత్ అంటే భారతదేశం, రాష్ట్రాల సమాఖ్య' అని నిర్వచించడం జరిగింది. అందువల్ల, ఈ రాష్ట్రాలు కలిసి ఇండియా లేదా భారత్‌గా ఏర్పడ్డాయి. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ రాష్ట్రాలలో ప్రజలందరి స్వరం బిగ్గరగా, స్పష్టంగా వినబడుతుంది. ఏ స్వరం నొక్కి వేయడం లేదా భయపెట్టడం జరగదు' అని అన్నారు. దేశాన్ని ఇండియా లేదా భారత్ అనే పేర్లతో పిలవడం ఆమోదయోగ్యమే అయినా పేరు మార్పు వెనుక ఉద్దేశాలే కీలకమని చెప్పారు. విపక్ష కూటమికి ఇండియా పేరు పెట్టడంతోనే కేంద్ర ప్రభుత్వం దేశం పేరును భారత్‌గా మార్చేందుకు పూనుకుందని ఆరోపించారు. అయితే తమ కూటమి పేరుతో కేంద్ర ప్రభుత్వం అసహనానికి లోనవుతోందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. దేశంలోని మైనారిటీలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ అణిచి వేస్తున్నాయని ఆరోపించారు. మైనారిటీలను బీజేపీ అణగదొక్కడాన్ని తాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నానని ఆయన చెప్పారు. మైనారిటీలు తమ స్వదేశంలోనే అభద్రతాభావంతో బతకడం దేశానికి సిగ్గుచేటని అన్నారు. బ్రస్సెల్స్ తర్వాత తన పర్యటనలో రెండవ యూరోపియన్ నగరమైన పారిస్‌లో చర్చా కార్యక్రమాన్ని సెంటర్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ నిర్వహించగా, పారిస్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్ అరాంచ గొంజాలెజ్ అధ్యక్షత వహించారు. నెదర్లాండ్స్‌లోని రోటర్ డ్యామ్‌కు వెళ్లడానికి ముందు రాహుల్ గాంధీ ఫ్రెంచ్ రాజధానిలోని ఇనాల్కొ విశ్వవిద్యాలయంలో కూడా విద్యార్థులతో చర్చా కార్యక్రమం ఉంటుంది.

అశోక చిహ్నానికి అవమానం

న్యూదిల్లీ: జీ20 శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతున్న దేశా ధినేతలకు, ఇతర ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వడానికి భారత ప్రభు త్వం సకల జాగ్రత్తలూ తీసుకుంది. భారీ ఏర్పాట్లు చేసింది. ఇది అతిథి మర్యాదల్లో భాగం. ఆతిథ్యం ఇచ్చే దేశం బాధ్యత. ఇందులో అభ్యం తరకరమైంది ఏమీ లేదు. భోజనాల ఏర్పాట్లు భారీగా చేశారు. అతిథు లకు వెండి, బంగారు పళ్లాల్లో వడ్డిస్తారని వార్తలు వచ్చాయి. ఈ పళ్లాల్లో ఒకటి త్రికోణాకారంలో ఉంది. నూతన పార్లమెంటు భవనాన్ని తలపించేలా చేయడానికి ఇలాంటి పళ్లెం తయారు చేయించి ఉంటారేమో. కానీ ఆ పళ్లెం మధ్యలో అశోక స్తంభంలోని మూడు సింహాల చిహ్నం ఉంది. అందులో భోజనం వడ్డించడం ఆ చిహ్నాన్ని అవమానించ డమేనన్న విమర్శలు హోరెత్తుతున్నాయి. ఆ పళ్లాన్ని భోజనం వడ్డించడానికి వాడడం లేదని, అది పూజకోసం అని అధికారులు చెపుతున్నారు. కానీ భోజనాల బల్ల మీద ఆ పళ్లెం ఉండడమే కాదు అందులో ఉప్పు, మిరియాలపొడి సీసాలు న్నాయి. అవీ భోజనంలో భాగమే కదా? అశోక చిహ్నాన్ని మన సైనికులు తమ యూనిఫాం మీద ధరించి గర్వపడుతూ ఉంటారు. అలాంటి చిహ్నాన్ని భోజనాల పళ్లెం మీద వాడడం ఏమిటి అన్న ప్రశ్న తలెత్తుతోంది. అశోక స్తంభం ఉన్న పళ్లాలో తిని ఎంగిలి చేయడం ఆ జాతీయ చిహ్నాన్ని అవమా నించడమే కదా అని అనేక మంది ప్రశ్నిస్తు న్నారు. ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని కూడా గట్టిగా కోరుతున్నారు. భోజనాలు వడ్డించడానికి అవసరమైన పళ్లాలు, గిన్నెలు జైపూర్ లోని ఐఆర్ఐఎస్ లోహ పరిశ్రమ నుంచి తెప్పించారు. విదేశీ ప్రతినిధులు బస చేస్తున్న అనేక హోటళ్ల వారు వీటిని ఆ కంపెనీ నుంచి తెప్పించారు. ఐఆర్ఎస్ఐఎస్ కంపెనీ భోజనాల బల్ల మీద ఉండే అనేక సామాగ్రిని సరఫరా చేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.